సోమవారం
20-06-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 70, సంచిక : 357
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఉ.కొరియాలో అంతుచిక్కని వ్యాధి

కోవిడ్‌లో వణుకుతున్న ఉత్తర కొరియాను అంతుచిక్కని వ్యాధి బెంబేలెత్తిస్తోంది. ఉత్తర కొరియాలోని రేవు నగరం హేజులో ప్రజలు అంతుచిక్కని పేగు సంబంధిత వ్యాధితో బాధపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ వ్యాధిగ్రస్తుల్లో టైఫాయిడ్, విరేచనాలు లేదా కలరా వంటి లక్షణాలు ఉన్నట్లు వెల్లడించారు.

2 లో

ఎఫ్ఐఆర్ నమోదైతే... అంతే

- సైన్యంలో చేరడం కష్టమే
- ఆందోళనల్లో పాల్గొనలేదని ప్రతిజ్ఞాపత్రం ఇవ్వాల్సిందే
- సైనికాధికారుల బెదిరింపు

న్యూఢిల్లీ: సైనిక నియామకాల కోసం కొత్తగా ప్రకటించిన 'అగ్నిపథ్'కు దరఖాస్తు చేసుకునేవారు గతంలో నిరసనలు, హింసాత్మక ఘటనల్లో పాల్గొనలేదనే విషయాన్ని వెల్లడించాల్సి ఉంటుందని త్రివిధ దళాలకు చెందిన ఉన్నతాధికారులు వెల్లడించారు. ఇందుకు సంబంధించి దరఖాస్తు సమయంలోనే ప్రమాణపత్రాన్ని సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఒకవేళ ఎఫ్ఐఆర్ నమోదైనట్లు పోలీస్ తనిఖీల్లో తేలితే అగ్నివీరులుగా ప్రవేశం పొందేందుకు వారికి ఆస్కారం ఉండదని తేల్చి చెప్పారు. అగ్నిపథ్ పథకం 1989 నుంచి పెండింగ్‌లో ఉందని, ఎట్టిపరిస్థితుల్లోనూ దీనిపై వెనక్కితగ్గే ప్రసక్తే లేదని చెప్పుకొచ్చారు. అగ్నిపథ్ పథకాన్ని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా కొనసాగుతోన్న ఆందోళనల నేపథ్యంలో త్రివిధ దళాల (సైన్యం, నావికాదళం, వైమానికదళం) ఉన్నతాధికారులు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. సైనిక వ్యవహారాల విభాగం అదనపు కార్యదర్శి లెఫ్టినెంట్ జనరల్ అనిల్ పూరీ మాట్లాడుతూ ఎన్నడూ ఎలాంటి ఆందోళనలు, దాడుల్లో పాల్గొనలేదని ప్రతిఒక్క అభ్యర్థి ప్రతిజ్ఞ చేయాలని స్పష్టం చేశారు. అగ్నివీరులుగా ఎంపికయ్యే సమయానికి పోలీసు తనిఖీ జరుగుతుందని వెల్లడించారు. 'తాజాగా ప్రవేశపెట్టిన పథకాన్ని వ్యతిరేకిస్తూ ఇటీవల జరిగిన హింసాత్మక ఘటనలను తాము ఊహించలేదని, క్రమశిక్షణే భారత సైన్యానికి పునాది అని, అటువంటి సైన్యంలో దాడులు, దహనాల వంటి క్రమశిక్షణారాహిత్యానికి చోటులేదని తెలిపారు. ఆందోళనలు, నిరసనల్లో పాల్గొనలేదని ప్రతి అభ్యర్థి ప్రమాణపత్రం సమర్పించడం తప్పనిసరని తేల్చిచెప్పారు. పోలీసు తనిఖీలో ఏ అభ్యర్థి మీదైనా ఎఫ్ఐఆర్ నమోదైనట్లు తేలినా అగ్నివీరులుగా వారికి ప్రవేశం లేదని స్పష్టం చేశారు. భారత సైన్యంలో ఉద్యోగం అంటేనే భావోద్వేగంతో కూడుకున్నదని, అటువంటి వాటిని జీతంతో లెక్కకట్టలేమని అనిల్ పూరీ

- మిగతా 2 లో

అగ్నిపథ్‌పై మరో కీలకభేటీ

2 లో

'బైజూస్' తాయిలం

- విద్యా వ్యవస్థలోకి కార్పొరేట్ ప్రవేశం
- సర్కారు ఎంఓయూపై విపక్షాల ఆగ్రహం
- వేగవంతంగా విద్యా సంస్కరణలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని విద్యారంగంలో గణనీయమైన మార్పులొస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక దానితో ఒకటి పోటీపడి మరీ సంస్కరణలు అమలు చేస్తున్నాయి. ఏ మార్పు తెచ్చినా దాన్ని నూతన విద్యా విధానం (ఎన్ఈపీ)లో భాగంగా చూపుతూ, అమలు చేయడం రాష్ట్ర ప్రభుత్వానికి పరిపాటైంది. బీజేపీ పాలిత రాష్ట్రాల కంటే, జగన్ ప్రభుత్వ వైఖరి మరీ దుందుడుకుగా ఉందనే విమర్శలున్నాయి. పేరొందిన పథకాల ముసుగులో కార్పొరేట్ విధానాల్ని తెరపైకి తెస్తోంది. తాజాగా విద్యా వ్యవస్థలోకి కార్పొరేట్ దిగ్గజ కంపెనీ బైజూస్‌తో ఎంఓయూ కుదుర్చుకోవడంపై సర్వత్రా వ్యతిరేకత నెలకొంది. ఈ విధానంతో విద్యా వ్యవస్థ పరిరక్షణకు పెనుప్రమాదం పొంచి ఉందని ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. నాణ్యత పేరుతో పెద్దఎత్తున ఉపాధ్యాయ పోస్టులు కుదించుకుపోయే ప్రమాదముంది. ఇప్పటికే ఎన్ఈపీ అమలుతో పాఠశాలలను తగ్గించడం, ఉపాధ్యాయుల సర్దుబాటు వంటి చర్యలకు ప్రభుత్వం ఉపక్రమించింది. ఈ చర్యలతో దాదాపు 25 వేల ఉపాధ్యాయ ఖాళీలు గల్లంతయ్యే పరిస్థితులున్నాయి. బైజూస్ ద్వారా ఏపీలో 8 నుంచి 10 తరగతుల విద్యార్థులకు విషయ పరిజ్ఞానం, ఇంటర్‌నెట్ పాఠాలు అందచేయడం లక్ష్యంగా నిర్ధారించారు. ఇందుకోసం 8వ తరగతికి వచ్చిన విద్యార్థులకు ట్యాబ్‌లు ఇస్తారు. ఆ బ్యాచ్ విద్యార్థులు 9వ తరగతిలోకి రాగానే, అదే ట్యాబ్‌లో 9వ తరగతి విషయ పరిజ్ఞానం, పదో తరగతిలోకి రాగానే, పది విషయ పరిజ్ఞానాన్ని సమకూరుస్తారు. విద్యార్థికి ఒక్క 8వ తరగతిలోనే మాత్రమే ఒక ట్యాబ్ ఇవ్వగా, దానిని పదో తరగతి వరకూ మూడేళ్లపాటు వినియోగించుకోవాలి. ఈ ఏడాది నుంచి నాలుగు లక్షలకుపైగా 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు

- మిగతా 2 లో

బతుకు భారం

అధిక ధరలతో సామాన్యులు విలవిల

- మందుల రేట్లు భారీగా పెంపు
- కేంద్రానికి సవాల్‌గా ద్రవ్యోల్బణం

న్యూఢిల్లీ: రిటైల్ ద్రవ్యోల్బణం మే నెలలో రికార్డు స్థాయిలో పెరగడంతో సామాన్యుల బతుకుభారంగా మారింది. చిల్లర ధరల వార్షిక ద్రవ్యోల్బణం మేలో 7.04 శాతం పెరిగింది, ఏప్రిల్‌లో 95 నెలల గరిష్ఠస్థాయి 7.79 శాతం నుండి కొద్దిగా తగ్గింది. టోకు ధరల ద్రవ్యోల్బణం మేలో రికార్డు స్థాయిలో 15.88 శాతానికి పెరిగింది. రికార్డు స్థాయికి చేరిన ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడం ఇప్పుడు కేంద్రానికి సవాల్‌గా మారింది. ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో సామాన్యుల జేబుకు చిల్లుపడుతోంది. ద్రవ్యోల్బణానికి ప్రధాన కారకంగా ఉన్న వంటనూనె ధరలు మండుతున్నాయి.దానితో ప్రభుత్వం దిగివచ్చి పన్నులు కొంతవరకు తగ్గించడంతో ప్రముఖ ఉత్పత్తిదారులు కొంతమేర తగ్గింపును ప్రకటించడంతో స్వల్పంగా తగ్గడం ప్రారంభించాయి. 'పెట్రోలు, డీజిల్ ధరలు బాగా ప్రియం అయ్యాయి... కానీ ఆ మేరకు క్యాబ్ చార్జీలు పెంచలేదు. మేము క్యాబ్ కంపెనీలకు కూడా చెల్లించాలి... మాకు మిగిలేది చాలా తక్కువ' అని 47 ఏళ్ల క్యాబ్ డ్రైవర్ సుఖ్వీందర్ సింగ్ చెప్పారు. 40 ఏళ్ల కూరగాయల విక్రేత మాట్లాడుతూ... ప్రజలు కూరగాయలను విక్రయదారుల నుంచి కొనుగోలు చేయకుండా ఇంటి తీసుకొచ్చి ఇవ్వడాన్ని ఎంచుకోవడం వల్ల రోజుకు రెండు పూట్ల భోజనం చేయడం కూడా కష్టంగా మారిందని వాపోయారు. దీంతో పాటు మందులు కూడా ఖరీదైనవిగా

- మిగతా 2 లో

అల్లూరి పేరిట రాజకీయం

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ, పక్కన శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, పాలారి, రవిచంద్ర, కాటం నాగభూషణం, హరినాథ్

- ఓట్ల కోసం బీజేపీ, మోదీ ఆరాటం
- 28న భీమవరంలో 'అల్లూరి' జయంతి సభ
- 21న అగ్నిపథ్‌కు వ్యతిరేకంగా సంఘీభావ సదస్సు
- వారం రోజులు జయంత్యోత్సవాలు
- పోలీసు రాజ్యం-ప్రతిపక్షాలపై అణచివేత
- సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు రామకృష్ణ, శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొనకపోగా, బ్రిటీషు వారికి వత్తాసు పలికిన ఆరెస్సెస్, బీజేపీ నేతలకు అల్లూరి పేరెత్తే అర్హత లేదనీ, రాజకీయ లబ్ధి కోసం మోదీ ఆరాటపడుతున్నారని సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కె.రామకృష్ణ, వి.శ్రీనివాసరావు విమర్శించారు. వామపక్ష పార్టీల సమావేశం విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞానకేంద్రంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం జరిగింది. అనంతరం విజయవాడ బాలోత్సవంలో వామపక్ష పార్టీల నేతలతో కలిసి రామకృష్ణ, శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడారు. రామకృష్ణ మాట్లాడుతూ 28వ తేదీన అల్లూరి వారసులు భీమవరంలో జయంతి సభ నిర్వహిస్తారని తెలిపారు. వారం రోజులు రాష్ట్రవ్యాప్తంగా జయంత్యుత్సవాలు ఉంటాయని వివరించారు. 21వ తేదీన అగ్నిపథ్‌కు వ్యతిరేకంగా యువత చేపట్టిన నిరసనలకు సంఘీభావంగా విజయవాడలో వామపక్షాలు సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. స్వాతంత్ర్య ఉద్యమంలో నాడు కాంగ్రెస్, కమ్యూనిస్టు, ముస్లింలీగ్ పార్టీలే పాల్గొన్నాయని గుర్తుచేశారు. బీజేపీ మాతృసంస్థ ఆరెస్సెస్ ఉన్నప్పటికీ ఎక్కడా పాల్గొనలేదనీ, పైగా బ్రిటీష్ వారికి పరోక్షంగా వత్తాసు పలికిందని విమర్శించారు. బీజేపీ నేతలు, ప్రధాని మోదీ సైతం అల్లూరి సీతారామరాజును స్మరించడం ఆక్షేపణీయమన్నారు. అల్లూరి జయంతులు జరుపుతామంటూ తెలుగు రాష్ట్రాల ప్రజలను మభ్యపెట్టేందుకు ముందుకు వస్తున్నారని, వారిని నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరని చెప్పారు. సైనిక ఉద్యోగాల కోసం ఆసక్తి చూపుతున్న యువత దేశవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించారని వివరించారు. కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకొచ్చిన అగ్నిపథ్‌పై నిరసనలు వెల్లువెత్తాయని చెప్పారు. ఇందులో రాజకీయ జోక్యం లేదన్నారు. యువత భవిష్యత్తును కాలరాసేలా కేంద్రం ఈ పథకాన్ని తెచ్చిందనీ, దాని పర్యవసానంగా ఆయా రాష్ట్రాల్లో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలకు మోదీ, రక్షణమంత్రి

- మిగతా 2 లో

అగ్నివీర్‌లకు బీజేపీ ఆఫీసుల వద్ద
కాపలా ఉద్యోగాలు

బీజేపీ జాతీయ కార్యదర్శి కైలాశ్ విజయవర్గీయ

అగ్నిపథ్ పథకం కింద అగ్నివీర్ ఉద్యోగం పొంది నాలుగేళ్లు పని చేసిన అనంతరం వారికి భారతీయ జనతా పార్టీ (బీజేపీ) కార్యాలయాల వద్ద కాపలాదారు (సెక్యూరిటీ గార్డులు) ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని కైలాశ్ విజయవర్గీయ పేర్కొన్నారు.

2 లో

పునరుజ్జీవం దిశగా కాంగ్రెస్

- నెల తర్వాత చింతన్ శిబిర్ నిర్ణయాల ఆచరణ
- కమ్యూనికేషన్స్ బాధ్యతలు జైరాం రమేశ్‌కు అప్పగింత

8 లో

జగన్ బుల్డోజర్ రాజకీయాలు: రామకృష్ణ

2 లో

అయ్యన్న ఇంటిపైకి బుల్డోజర్

- ప్రహరీ కూల్చివేత
- స్థలం ఆక్రమించారంటూ అధికారుల చర్యలు
- భారీగా మోహరించిన టీడీపీ శ్రేణులు, పోలీసులు

విశాలాంధ్ర-నర్సీపట్నం: అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలోని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఇంటి వద్ద ఆదివారం యుద్ధ వాతావరణం నెలకొంది. ఆయన ఇంటి వద్ద రెండు సెంట్ల అక్రమ నిర్మాణం జరిగిందంటూ జేసీబీలతో గోడను కూల్చివేశారు. ఆర్డీవో గోవిందరావు, మున్సిపల్ కమిషనర్ కనకారావు, ఏఎస్పీ మణికంఠ చందోల్ పర్యవేక్షణలో అయ్యన్న ఇంటి ప్రహరీని రెవెన్యూ అధికారులు భారీ యంత్రాంగంతో పడగొట్టారు. ముందస్తు నోటీసులు జారీ చేయకుండా చర్యలు చేపట్టడమేంటని అయ్యన్న తనయుడు రాజేశ్ ప్రశ్నించారు. విషయం తెలుసుకున్న టీడీపీ కార్యకర్తలు నర్సీపట్నం నియోజకవర్గం నలుమూలల నుంచి అయ్యన్న ఇంటికి తరలివచ్చారు. దీంతో అక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అయ్యన్నపాత్రుడు స్థానికంగా లేరని తెలిసింది. ఇదిలాగా ఉండగా అయ్యన్నపాత్రుడు

- మిగతా 2 లో

ఇదీ లోకం!

తెలంగాణ హైకోర్టు సీజేగా జస్టిస్ ఉజ్జల్ భుయాన్

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఉజ్జల్ భుయాన్ నియమితులయ్యారు. రాష్ట్రపతి ఉత్తర్వుల మేరకు కేంద్ర ప్రభుత్వం ఈ మేరకు గెజిట్ విడుదల చేసింది. ప్రస్తుతం తెలంగాణ హైకోర్టు సీజేగా ఉన్న జస్టిస్ సతీశ్‌చంద్ర శర్మను బదిలీ చేసి ఆయన స్థానంలో జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌కు పదోన్నతి ఇవ్వాలని సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసిన సంగతి తెలిసిందే. ఆ మేరకు ఆదివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. హైకోర్టు సీజే జస్టిస్ సతీశ్‌చంద్రశర్మను ఢిల్లీ హైకోర్టుకు బదిలీ చేశారు.

మళ్లీ కంబిరిగాం భూ వివాదం

- రైతుల మధ్య కొట్లాట: పదిమందికి గాయాలు
- పోలీసు పహారాలో కేదారిపురం

విశాలాంధ్ర-పలాస: శ్రీకాకుళం జిల్లా పలాస మండలం కేదారిపురంలో భూ వివాదం మళ్లీ రగిలింది. రెండువర్గాల రైతుల మధ్య ఆదివారం కొట్లాట జరిగింది. రెండు వర్గాలకు చెందిన 10 మంది రైతులకు గాయాలయ్యాయి. పోలీసులు రంగప్రవేశం చేసి..శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. కాశీబుగ్గ సీఐ శంకరరావు అధ్వర్యంలో గ్రామంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కంబిరిగాం భూముల వ్యవహారంలో పోరాట రైతులకు పంపకాలు సరిగ్గా జరగలేదని, భూస్వాములకు, బినామీ రైతులకు అధికారులు కొమ్ముకాస్తున్నారని, కేదారిపురం, కంబిరిగాం గ్రామాల రైతులు మూడు నెలలుగా ఆందోళన చేస్తున్నారు. ఈ క్రమంలో కేదారిపురం గ్రామానికి చెందిన 20 మంది యువకులు పలాసలో నివాసముంటున్న మాజీ సర్పంచ్ కె.ఫాల్గుణరావును ప్రశ్నించేందుకు ఆదివారం వెళ్లడంతో వివాదం తలెత్తింది. ఫల్గుణరావును ప్రశ్నిస్తున్న సమయంలో కమిటీ సభ్యులు కొంతమంది అక్కడికి చేరుకొని యువకులతో వాగ్వాదానికి దిగారు. చివరికి సమస్య సద్దుమణిగి యువకులు తిరిగి గ్రామానికి వెళ్లిపోయారు. అయితే, రోడ్డు పక్కన చెట్ల వద్ద తారకేశ్వరరావు, భాస్కరరావు ఉన్నారన్న సమాచారం తెలుసుకున్న బినామీ రైతులు అక్కడికి వచ్చి వారితో ఘర్షణకు దిగారు. మాజీ సర్పంచ్ ఫల్గుణరావును ప్రశ్నించాల్సిన అవసరం ఏమిటి? ఎందుకు రాద్ధాంతం చేస్తున్నారని ప్రశ్నించారు. ఈ సమయంలో కొంతమంది యువకులు అక్కడికి వచ్చి ఘర్షణకు దిగారు. ఈ ఘర్షణలో పోరాట రైతులు ఒట్టికుల మాధవయ్య, రుంకు తారకేశ్వరరావు, పాడి కిరణ్, పాడి చిరంజీవి, రుంకు పాపారావు, భాస్కరరావులకు గాయపడ్డారు. భూ పంపకాలను సమర్థిస్తున్న రైతులు కొల్లి లోకనాథం, పాడి

- మిగతా 2 లో

ఉ.కొరియాలో అంతుచిక్కని వ్యాధి

హేజు నగరంలో భారీగా కేసులు

సియోల్: కోవిడ్‌లో వణుకుతున్న ఉత్తర కొరియాను అంతుచిక్కని వ్యాధి బెంబేలెత్తిస్తోంది. ఉత్తర కొరియాలోని రేవు నగరం హేజులో ప్రజలు అంతుచిక్కని పేగు సంబంధిత వ్యాధితో బాధపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ వ్యాధిగ్రస్తుల్లో టైఫాయిడ్, విరేచనాలు లేదా కలరా వంటి లక్షణాలు ఉన్నట్లు వెల్లడించారు. కలుషిత ఆహారం, నీరు లేదా వ్యాధిగ్రస్తునితో సంపర్కం పేగు సంబంధిత వైరస్ వ్యాపిస్తోందన్నారు. మంచి నీటి శుద్ధి సౌకర్యాలు లేని ఉత్తర కొరియాలో ఇటువంటి వ్యాధులు సాధారణంగా సంభవిస్తాయి. 1990ల మధ్యకాలం నుంచి దీని కారణంగా ప్రజారోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలు చాలా వరకు దెబ్బతిన్నాయి. కరోనా వ్యాప్తి కొనసాగుతుండగా పెద్ద సంఖ్యలో జనం జ్వర లక్షణాలతో బాధపడుతున్నట్టు ఉత్తర కొరియా వెల్లడించింది. అయితే, ఆ జ్వరం కేసుల్లో మీజిల్స్, టైఫాయిడ్, పెర్టుసిస్ వంటి వ్యాధులతో బాధపడుతున్న వారు కూడా భారీ సంఖ్యలో ఉన్నట్టు దక్షిణ కొరియా గూఢచారి సంస్థ పేర్కొంది. ఉత్తర కొరియాలో 4,558,260 కోవిడ్ కేసులు నమోదు కాగా 73 మంది మృతి చెందినట్టు అధికారికంగా ప్రకటించింది. 4,511,950 మంది వైరస్ నుంచి కోలుకున్నారు. దేశంలో కొత్తగా 26,010 మంది జ్వరంతో బాధపడుతున్నారని అధికారులు తెలిపారు. ఉత్తర కొరియాలో ఆరోగ్య వ్యవస్థ సరిగా లేకపోవడం, పౌరులకు వాక్సిన్ అందకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని నిపుణులు అభిప్రాయపడ్డారు.

ఉక్రెయిన్-రష్యా యుద్ధం

ఇప్పట్లో ముగియదు

జెన్స్ స్టోలెన్‌బర్గ్

ఫ్రాంక్‌ఫర్ట్: ఉక్రెయిన్-రష్యా మధ్య యుద్ధం సుదీర్ఘకాలం సాగుతుందని, ఇప్పట్లో ముగిసే సూచనలు లేవని నాటో చీఫ్ జెన్స్ స్టోలెన్‌బర్గ్ అన్నారు. ఉక్రెయిన్‌కు అందుతున్న ఆయుధ సాయం వల్ల రష్యా నియంత్రణ నుంచి దాంబస్ ప్రాంతానికి విమోచనం కల్పించే అవకాశాలు మెండుగా ఉన్నాయని తెలిపారు. ఈ యుద్ధం ముగియాలంటే చాలా ఏళ్లు పట్టవచ్చు.. కాబట్టి ఉక్రెయిన్‌కు అన్ని విధాలుగా సహకరించేందుకు మనం సిద్ధంగా ఉండాలని ఆయనన్నారు. ఉక్రెయిన్‌కు మద్దతును కొనసాగించాలని, ఇంధనం, ఆహార ధరల క్రమంలో యుద్ధం వ్యయం పెరుగుతోందని జర్మన్ వీక్లీ బిల్డ్ ఆమ్ సొన్నటాగ్‌తో స్టోలన్‌బర్గ్ అన్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ ఉక్రెయిన్‌కు అండగా నిలవాలని పాశ్చాత్య దేశాలకు సూచించారు. కాగా, ఈనెలాఖరులో మాడ్రిడ్‌లో జరగబోయే నాటో సదస్సులో ఉక్రెయిన్‌కు సహాయక ప్యాకేజిని ప్రకటించనున్నట్లు ఆయన ఇంతకుముందే ప్రకటించారు.

ఐదేళ్ల తర్వాత పాక్ నుంచి 20 మంది భారతీయ జాలర్ల విడుదల

కరాచీ: గత ఐదేళ్లలో కరాచీ జైల్లో ఉన్న భారతీయ మత్స్యకారులు 20 మందిని సుహృద్భావ చర్యగా ఆదివారం విడుదల చేసింది. తమ దేశ జలాల్లో అక్రమ వేట చేసిన నేరం కింద వీరిని పాకిస్థాన్ అరెస్టు చేసింది. వీరు కరాచీలోని లంధీ ప్రాంతంలోగల మలిర్ జిల్లా జైలులో ఐదేళ్లు గడిపారు. విడుదల అనంతరం వీరందరినీ లాహోర్‌కు తరలించారు. అక్కడ నుంచి వాఘా సరిహద్దు వద్దకు తీసుకెళ్లి భారతీయ అధికారులకు అప్పగించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు 20 మంది జాలర్లను విడుదల చేసినట్లు జైలు సూపరింటెండెంట్ ఇర్షాద్ తెలిపారు. జాలర్లను 2018 జూన్‌లో అరెస్టు చేయగా వారు ఐదేళ్ల శిక్షను అనుభవించారని, విడుదల నేపథ్యంలో వీరిని ఈదీ ట్రస్టుకు అప్పగించామని ఆయనన్నారు. భారతీయ మత్స్యకారుల ప్రయాణ ఖర్చులను తామే భరించినట్లు ఎన్జీవో ఈదీ ట్రస్ట్ వ్యవస్థాపకులు ఫైసల్ ఈదీ అన్నారు.

ఫిలిప్పీన్స్ ఉపాధ్యక్షురాలిగా సారా

ఘనంగా ప్రమాణ స్వీకారం

30న బాధ్యతల స్వీకరణ

మనీలా : ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు రోడ్రిగో డుటర్టే కుమార్తె సారా డుటర్టే ఆ దేశ ఉపాధ్యక్షురాలిగా ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈనెల 30న ఆమె పదవీ బాధ్యతలను స్వీకరిస్తారు. అధ్యక్షుడిగా ఎన్నికైన ఫెర్దినార్డ్ మార్కోస్ జూనియర్ 30వ తేదీన మనీలాలో దేశ నూతన అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేస్తారు. సారా డుటర్టే తమ స్వస్థలమైన దావో మేయర్‌గా ఉన్నారు. ఆమె ప్రమాణ స్వీకారోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి అందరు ప్రముఖులను భారీ బందోబస్తు నడుమ రేవు నగరమైన దావోని పబ్లిక్ స్క్వేర్‌కు డుటర్టే తరలించారు. ఈయన 1980 దశకంలో అక్కడి మేయర్‌గా సుదీర్ఘకాలం సేవలు అందించారు.

మాట్లాడుతున్న విజయ్, రాజేశ్

అయ్యన్న ఇంటిపైకి బుల్డోజర్

(మొదటిపేజీ తరువాయి)

ఇంటి గోడను కూల్చడాన్ని నిరసిస్తూ మాజీ ఎమ్మెల్యే, అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీలా గోవింద సత్యనారాయణ, జిల్లాల్లోని టీడీపీ మాజీ ఎమ్మెల్యేలతో, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లతో కలిసి వారి ఇంటిని పరిశీలించారు. అయ్యన్న సతీమణి పద్మావతిని వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ ప్రభుత్వ అరాచకాలను ప్రశ్నించబట్టే అయ్యన్న గొంతునొక్కే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా పోలీసులు ఇంటి గోడను ఎలా కూల్చివేస్తారని ప్రశ్నించారు. అయ్యన్న తనయుడు చింతకాయల విజయ్ మాట్లాడుతూ గోడ కూడగొట్టేందుకు ఐపీఎస్ అధికారి రావడం ఎక్కడా చూడలేదన్నారు. సీఎం మార్గదర్శకత్వంలోనే అధికారులు నడుస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ ఘటనల ఆధారాలతో హైకోర్టును ఆశ్రయించనున్నట్టు తెలిపారు. మరో కుమారుడు రాజేశ్ మాట్లాడుతూ అన్ని అనుమతులు తీసుకున్న తరువాతే ప్రహరీ నిర్మించామన్నారు. పోలీసులు ఇంట్లోకి దౌర్జన్యంగా ప్రవేశించారన్నారు.

జగన్ బుల్డోజర్ రాజకీయాలు: రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీలోనూ మోదీ తరహా బుల్డోజర్ రాజకీయాలకు జగన్ సర్కార్ తెరతీసిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. నర్సీపట్నంలో మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు ఇంటి ప్రహరీని బుల్డోజర్‌తో కూల్చడాన్ని ఆదివారం ఓ ప్రకటనలో ఖండించారు. దిల్లీలో మోదీ సర్కార్, ఉత్తరప్రదేశ్‌లో యోగి సర్కార్ చేస్తున్న బుల్డోజర్ రాజకీయాలను జగన్ సర్కార్ అనుసరించటం విచారకరమని వ్యాఖ్యానించారు. ప్రతిపక్షాల విమర్శలను ప్రజాస్వామ్య పద్ధతిలో ఎదుర్కోవడానికి బదులు బ్లాక్‌మెయిలింగ్‌కు దిగడం సరికాదని, ప్రతిపక్ష పార్టీలపై అధికారులను, పోలీసులను ప్రయోగించి దాడులకు, అరెస్టులకు, బెదిరింపులకు పాల్పడటం రాష్ట్ర ప్రభుత్వానికి తగదని హితవు పలికారు. శాంతియుత ప్రజాఉద్యమాలపై పోలీసులతో ఉక్కుపాదం మోపుతూ నేతలను ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధాలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఏపీలో నిరంకుశ పాలన సాగుతోందని, ప్రజాతంత్రవాదులంతా ప్రభుత్వ, పోలీసు చర్యలను ఖండించాలని కోరారు.

అగ్నిపథ్‌పై మరో కీలకభేటీ

- త్రివిధ దళాధిపతులను కలిసిన రక్షణ మంత్రి
- ఆందోళనలను చల్లార్చడమే అజెండా

న్యూదిల్లీ: అగ్నిపథ్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళనలు మిన్నంటుతున్న వేళ త్రివిధ దళాధిపతులతో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆదివారం భేటీ అయ్యారు. ఇదే అంశమై జరిగే రెండవ సమావేశం ఇది. అయితే సమావేశం గురించి వివరాలు తెలియరాలేదు. ఆందోళనకారులను శాంతింపజేసే చర్యలపై చర్చించినట్లు సమాచారం. శనివారం జరిగిన సమావేశం అనంతరం అగ్నిపథ్ పథకంలో కొన్ని సవరణలు చేశారు. నాలుగేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న అగ్నివీరులకు కేంద్ర పారా మిలట్రీ , అసోం రైఫిల్స్‌లో 10శాతం రిజర్వేషన్ ప్రకటించారు. అదే విధంగా వేర్వేరు సంస్థల్లోనూ పదిశాతం ఉద్యోగాలను అగ్నివీరుల కోసం రిజర్వు చేయాలన్న ప్రతిపాదనకూ రక్షణ మంత్రి ఆమోదం తెలిపారు. ఇదిలావుంటే, భారతీయ వైమానిక దళం ఆదివారం ఈ కొత్త పథకానికి సంబంధించి కొన్ని వివరాలను వెల్లడించింది. నేవీ, ఆర్మీ కూడా త్వరలోనే ఈ మేరకు వివరాలను వెల్లడిస్తాయని తెలుస్తోంది. మొదటి బ్యాచీలను త్వరలోనే మొదలు పెట్టి వచ్చే ఏడాది జూన్ నాటికి వారిని విధుల్లోకి పంపాలని త్రివిధ దళాలు భావిస్తున్నట్లు సీనియర్ సైన్యాధికారులు తెలిపారు.

బతుకు భారం

(మొదటిపేజీ తరువాయి)

మారుతున్నాయన్నారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణాన్ని అదుపు చేసేందుకు పెట్రోలియం ఉత్పత్తులపై ఎక్సైజ్ సుంకాన్ని మరింత తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వానికి అవకాశం ఉన్నప్పటికీ అలాచేయకుండా ద్రవ్య విధానానికి ప్రాధాన్యత ఇస్తుందని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. ఆహార వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయనీ, సాధారణ రుతుపవనాలే దానికి అడ్డుకట్టవేస్తుందని పేర్కొంటున్నారు. ద్రవ్యోల్బణం వరుసగా ఐదవ నెలలో ఎక్కువగా ఉన్నందున ఆర్బీఐ ఇప్పటికే వడ్డీ రేట్లను 90 బేసిస్ పాయింట్లు పెంచింది. మరో 80 బేసిస్ పాయింట్లు పెంచుతుందని వారు భావిస్తున్నారు.

ఇంధనం, ఆహార ఉత్పత్తుల అధిక ధరల కారణంగా దేశంలో ద్రవ్యోల్బణం ప్రధానంగా పెరిగిందని, రాబోయే నెలల్లో ఇది ఒక మోస్తరుగా ఉంటుందని ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి అజయ్ సేథ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ముడిచమురు ధరల పెరుగుదల ఖచ్చితంగా ఒక సవాలని, వాటి ధరలను అదుపుచేసేందుకు అవసరమైన, సాధ్యమయ్యే చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

ఈ మధ్య కాలంలో అన్ని వస్తువుల ధరలు గణనీయంగా పెరిగాయి. కూరగాయలు, స్కూల్ ఫీజు, బస్ చార్జీల నుంచి ఇంటి రుణాల వరకు అన్నీ పెరిగిపోతున్నాయి. వడ్డీ రేట్ల తగ్గింపును సద్వినియోగం చేసుకుని చాలా మంది గృహ రుణాల వైపు మొగ్గు చూపారు. కోవిడ్ మహమ్మారి సమయంలో, వడ్డీ రేట్లు 6.5 శాతంగా ఉన్నాయి. ఇప్పుడు అది 7.3 నుండి 7.5 శాతానికి పెరిగింది.

వడ్డీ రేటులో ఈ వ్యత్యాసం మధ్య,ఆదాయ వర్గాలకు, ముఖ్యంగా ఉద్యోగులకు నెలవారీ బడ్జెట్‌ను పెంచుతోంది. గృహ రుణం మొత్తంలో పెరుగుదల భర్తీ చేయడానికి అనేక సర్దుబాట్లు చేయవలసి వస్తోందని గృహరుణాలు తీసుకున్న వారు చెపుతున్నారు.

అల్లూరి పేరిట రాజకీయం

(మొదటిపేజీ తరువాయి)

బాధ్యత వహించాలని డిమాండు చేశారు. సికింద్రాబాద్ ఘటనను తెలంగాణ ప్రభుత్వం అదుపు చేయలేకపోయిందని బీజేపీ నేతలు చేస్తున్న విమర్శలు అర్థరహితమని చెప్పారు. అదే బీజేపీ పాలిత రాష్ట్రాలు హరియాణా, బీహార్‌లోనూ నిరసనలు జరిగాయన్నారు. ఇప్పటికే ప్రభుత్వ రంగ సంస్థలను ఒకదాని తర్వాత ఒకటి ప్రైవేట్ రంగానికి అప్పగిస్తున్నారని మండిపడ్డారు. అంతా కాంట్రాక్టుమయం చేస్తున్నారని, చివరకు సైన్యాన్ని సైతం కాంట్రాక్టుపరం చేయాలని చూస్తూ దేశ ప్రతిష్ఠను బీజేపీ దిగజారుస్తోందని ధ్వజమెత్తారు. రైతులకు సాయం చేయడంలోను, వారి సమస్యల పరిష్కారంలోనూ దేశంతోనే పోటీ పడుతున్నామంటూ సీఎం జగన్ చెబుతున్నారనీ, మరి పంటనష్టపోయిన రైతులంతా రోడ్డెక్కే పరిస్థితి ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. ఈ-క్రాప్ కోసం 49 లక్షల మంది దరఖాస్తు చేసుకుంటే 30లక్షల 60వేల మందికే పంటనష్టం జరిగినట్లు ప్రభుత్వం చెబుతోందన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే పంట నష్టపోయిన రైతులందరికీ నష్టపరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా ఇవ్వకుండా సీఎం జగన్ మోసగిస్తున్నారని మండిపడ్డారు. క్రాప్ హాలిడేపై మోదీ, జగన్ సమాధానం చెప్పాలన్నారు. పోలీసే స్టేషన్‌లో ఉన్న వారిని పరామర్శించడానికి వెళ్లిన సీపీఎం నేతలు మధు, వై.వెంకటేశ్వరరావును పోలీసులు అరెస్టు చేయడాన్ని తప్పుబట్టారు. నిర్బంధాలకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం తెస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశభక్తిని మార్కెట్‌లో సరుకుగా బీజేపీ, మోదీ మార్చడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రజలు ఇలాంటి మాయలో పడవద్దని కోరారు. బీజేపీకి, మోదీకి అల్లూరి సీతారామరాజు పేరు ప్రస్తావించే అర్హత లేదన్నారు. ఏపీకి కేంద్ర ప్రభుత్వం తీరని ద్రోహం చేసిందనీ, ప్రత్యేక హోదా ప్రకటించలేదని, విభజన హామీలను అమలు చేయలేదని మండిపడ్డారు. రాజధాని నిర్మాణానికి డబ్బులు ఇవ్వలేదని, పోలవరానికి నిధులు కేటాయించలేదని, కడపలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మించలేదని చెప్పారు. ఇవేమీ ఇవ్వకుండా ఏ ముఖం పెట్టుకుని రాష్ట్రానికి వస్తారని నిలదీశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ప్రకటించాకే తెలుగుగడ్డపై అడుగుపెట్టాలని డిమాండు చేశారు. కేంద్ర ప్రభుత్వ నిరంకుశ విధానాలపై పోరాడిన చరిత్ర తెలుగు ప్రజలకు ఉందని స్పష్టం చేశారు. దేశభక్తి ముసుగులో సైన్యాన్ని సైతం కార్పొరేట్‌పరం చేసేందుకు మోదీ కుట్ర పన్నారన్నారు. అగ్నిపథ్ పథకం ప్రభావంతో నాలుగేళ్లపాటు సైన్యంలో యువత సేవలందించాక, కార్పొరేట్ కంపెనీల దగ్గర బౌన్సర్లుగాను, భద్రతా సిబ్బందిగానూ పనిచేయాల్సిన పరిస్థితి దాపురిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే దేశ వ్యాప్తంగా యువత విరుచుకుపడ్డారని, ఇందులో ఎలాంటి కుట్రకోణం లేదన్నారు. ఎవరితోనూ సంప్రదించకుండా, ఏకపక్షంగా అగ్నిపథ్‌ను కేంద్రం తెరపైకి తెచ్చిందని, దీంతో సైనిక ఉద్యోగాల కోసం వేచివున్న యువత ఒక్కసారిగా ఎగసిపడిందని చెప్పారు. అగ్నిపథ్‌పై వైసీపీ, టీడీపీ, జనసేన వైఖరి తెలపాలనీ, ఆ పార్టీలు ప్రజల వైపు ఉంటాయా?, మోదీ వైపు ఉంటాయా? స్పష్టంచేయాలని నిలదీశారు. సమావేశంలో వామపక్ష పార్టీల నేతలు వై.వెంకటేశ్వరరావు, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నుంచి పోలారి, రవిచంద్ర, ఎంసీపీఐ(యూ) నుంచి కాటం నాగభూషణం, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నుంచి డి.హరినాథ్ పాల్గొన్నారు.

'బైజూస్' తాయిలం

(మొదటిపేజీ తరువాయి)

పంపిణీ చేసి, అందులో బైజూస్ విషయ పరిజ్ఞానం, ఆన్‌లైన్ బోధనా సౌకర్యం కల్పిస్తారు. ఇది మంచి పథకమే అయినప్పటికీ, దీని ముసుగులో ఉపాధ్యాయుల కుదింపు, ప్రభుత్వ విద్యా వ్యవస్థలోకి కార్పొరేట్ రంగం బలపడే ప్రమాదముందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు, సంఘాలు ఆందోళన చెందుతున్నాయి.

బైజూస్‌పై విపక్షాల వ్యతిరేకత

ఇప్పటికే నూతన విద్యా విధానం (ఎన్‌ఈపీ)-2020 అమలుతోపాటు బైజూస్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుర్చుకోడాన్ని విపక్షాలూ తప్పుబడుతున్నాయి. దీనిపై అధికార, ప్రతిపక్షాలు ఇటీవల విమర్శించుకున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులను కుదింపు చర్యల్లో భాగంగానే, జగన్ ప్రభుత్వం ఈ దిశగా సంస్కరణకు తెరలేపిందనే అనుమానాలున్నాయి. ఇటీవల చంద్రబాబు తన పర్యటనలో బైజూస్...జగన్ జూస్ అంటూ ఎద్దేవా చేయగా, దానికి అధికార పక్షం నుంచి విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ దీటుగా సమాధానమిచ్చారు. విద్యా రంగంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా, ప్రభుత్వ పాఠశాలలకు మెరుగైన విద్యనందించాలనే లక్ష్యంతో బైజూస్‌తో ఒప్పందం కుదుర్చుకున్నటు తెలిపారు. గత ప్రభుత్వాలేమీ ఒప్పందాలు కుదుర్చుకోలేదా? దానిపై చర్చకు రావాలంటూ సవాల్ విసిరారు. నూతన విద్యా విధానం అమలుపై ఏపీ ప్రభుత్వం ఇప్పటికే జీవో 117 అమలు చేసింది. పాఠశాలలను, ఉపాధ్యాయులను వర్గీకరించి విద్యా వ్యవస్థను చిన్నాభిన్నం చేసిందనే విమర్శలున్నాయి. దీనిని వ్యతిరేకిస్తూ ఉపాధ్యాయ సంఘాలు ఉద్యమం చేస్తున్నారు. దేశంలోని బీజేపీ పాలిత ప్రాంతాల్లో సైతం నూతన విద్యా విధానం ఇంత వేగంగా అమలుకు నోచుకోవడం లేదు. ఒక్క ఏపీలోనే జగన్ ప్రభుత్వం వేగవంతం చేయడంపై ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బైజూస్‌తో ఒప్పందం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ప్రజాస్వామ్య విధానాల్ని పాటించలేదని, ఎవరితోనూ చర్చించకుండా, ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడాన్ని తప్పుపడుతున్నారు.

డీఎస్సీ ఖాళీలపై ప్రభావం

నూతన విద్యా విధానం, బైజూస్ లాంటి కార్పొరేట్ దిగ్గజం సంస్థలతో జగన్ సర్కారు ఒప్పందాల ప్రభావం వెరసి రాబోయే రోజుల్లో డీఎస్సీ నియామకాలపై తీవ్ర ప్రభావం పడుతుందని నిరుద్యోగ ఉపాధ్యాయుల్లో (ఛాత్రోపాధ్యాయులు) ఆందోళన నెలకొంది. ఈ ఒప్పందాల్లో ఎలాంటి ప్రజాస్వామ్య పద్ధతుల్ని పాటించలేదనే విమర్శలున్నాయి. ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లవుతున్న నూతన డీఎస్సీ ద్వారా ఇంతవరకూ నియామకాలు చేపట్టలేదు. 1998తోపాటు గత పాత డీఎస్సీలకు చెందిన పదులు, వందల సంఖ్యలో ఉన్న కొద్దిపాటి పెండింగ్ నియామకాలను ప్రభుత్వం చేపట్టి చేతులు దులుపుకుంటోంది. జగన్ అధికారంలోకి రాక ముందు తన పాదయాత్రలో ఏటా 10వేల పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటిస్తానంటూ హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి మూడేళ్లవుతున్నప్పటికీ ఒక్క డీఎస్సీ ఇవ్వలేదు.

నూతన విద్యా విధానం అమలులో ఉపాధ్యాయులను సర్దుబాటు చేయడం వల్ల ఖాళీలు కుదించుకుపోతున్నాయి. జగన్ అధికారంలోకి రాక ముందు దాదాపు 25వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండగా, ఇప్పుడు వాటిని కుదించి, అధికారులు లెక్కలు చెబుతున్నారు. సర్వీసులో ఉన్న ఉపాధ్యాయుల వయోపరిమితి 60ఏళ్లకు పెంచడంతో, ఈ ఏడాది నుంచి ఖాళీలు మరింత తగ్గిపోనున్నాయి. వాటన్నిటీ సర్దుబాటు చేసే క్రమంలోనే నూతన విద్యా విధానం అమలు, బైజూస్ లాంటి కార్పొరేట్ కంపెనీతో జగన్ ప్రభుత్వం ఒప్పందాలు పెట్టుకుంటోందంటూ విపక్షాలు తక్షణమే బైజూస్‌తో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాల్ని విరమించాలని, లేకుంటే ఉద్యమిస్తామని డిమాండు చేస్తున్నాయి.

గాయాలైన వారిని పరామర్శిస్తున్న సిపిఐ బృందం

మళ్లీ కంబిరిగాం భూ వివాదం

(మొదటిపేజీ తరువాయి)

కేశవరావులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులు పలాస ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా కేదారిపురంలో పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేశారు. బినామీ భూముల కోసమే ఘర్షణ: కంబిరిగాం భూ వ్యవహారం మళ్లీ మొదటికి వచ్చే పరిస్థితులున్నట్లు గతంలోనే విశాలాంధ్ర హెచ్చరించింది. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం 2/3 వంతు రైతులు, ఈనామ్‌దారులు భూమి పంచుకోవాల్సి ఉంది. ఆ ప్రకారమే రెవెన్యూ యంత్రాంగం భూ పంపిణీ చేపట్టింది. అయితే పంపకాల్లో మొత్తం 12 మంది బినామీ రైతులకు 60 ఎకరాల భూములు పంపిణీ చేయడంతో స్థానిక యువకుల్లో ఆందోళన మొదలైంది. అప్పట్లో 90 మంది రైతులు ఉండగా ప్రస్తుతం వారి వారసులతో కలిసి మొత్తం 122 మంది అయ్యారు. అప్పటి వరకు రైతుల ఆధీనంలో మొత్తం 194.65 ఎకరాల భూమి ఉండేది. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం 2/3 వంతు ఈనామ్‌దారులు, రైతులు పంచుకోవాలని సూచించింది. దీనికి రెండు వర్గాలు అంగీకరించాయి. దీని ప్రకారం రైతులకు మొత్తం 129.70 ఎకరాల భూమి వచ్చింది. మొత్తం భూమి పంచుకోవడం కష్టం కావడంతో మరోసారి 2020లో పెద్ద మనుషుల ఒప్పందం కుదుర్చుకున్నారు. భూ పంపకాల్లో సాంకేతిక ఇబ్బందులు రావడంతో మొత్తం 20 ఎకరాల భూమిని ఈనామ్‌దారులకు ఇచ్చేందుకు ఒప్పందం కుదిరింది. భూస్వాములు, మధ్యవర్తులుగా ఉన్న రైతులు ఒకటై తమకు అన్యాయం చేశారని, సమానంగా భూములు పంపిణీ చేయలేదని మూడు నెలలుగా సీపీఐ అధ్వర్యంలో రైతులు ఆందోళన చేస్తున్నారు. బినామీ రైతులకే రెవెన్యూ అధికారులు వత్తాసు పలుకుతున్నారని పోరాట రైతులు ఆరోపిస్తున్నారు.

సీపీఐ నాయకుల పరామర్శ: ఘర్షణలో గాయపడి...పలాస ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న రైతులను సీపీఐ బృందం ఆదివారం పరామర్శించింది. బృందంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి, రాష్ట్ర సమితి సభ్యులు చాపర సుందరలాల్, జిల్లా కార్యవర్గ సభ్యులు చాపర వెంకటరమణ, లండ వెంకటరమణ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి అనపాన షణ్ముఖరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు పాల పోలారావు, విద్యార్థిసంఘం నాయకుడు ప్రభుదేవ్ బెహరా, ఏఐవైఎఫ్ పలాస నియోజకవర్గ కార్యదర్శి వై.మురళీ ఉన్నారు.

ఇది నిరుద్యోగుల పాలిట అగ్నిబాట: రాహుల్

న్యూదిల్లీ: సాయుధ దళాల్లో నియామకాల కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన అగ్నిపథ్ పథకం నిరుద్యోగులను అగ్నిబాటపై నడిచేలా చేసిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆవేదన వ్యక్తంచేశారు. ఉద్యోగాలపై ప్రధానమంత్రి మోదీ పదేపదే తప్పుడు ఆశలు కల్పించి వారిని అగ్నిమార్గంలో పయనించేలా చేశారని మండిపడ్డారు. అగ్నిపథ్ పథకంపై దేశవ్యాప్తంగా నిరుద్యోగ యువత నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోన్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ తీరుపై రాహుల్‌గాంధీ మరోసారి విమర్శలు గుప్పించారు. 'ఉద్యోగాలపై తప్పుడు ఆశలు కల్పించడం ద్వారా దేశంలోని యువతను నిరుద్యోగం అనే 'అగ్నిబాట'పై నడిచేలా చేశారు. గడిచిన 8 ఏళ్లలో 16కోట్ల ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉంది. కానీ, యువతకు మాత్రం పకోడీలు వేపుకు తినే జ్ఞానం మాత్రమే కల్పించారు. దేశంలో నెలకొన్న ఇటువంటి పరిస్థితికి ప్రధానమంత్రే బాధ్యత వహించాలి' అని రాహుల్‌గాంధీ పేర్కొన్నారు.

ఇదిలాఉంటే అగ్నిపథ్ పథకాన్ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా ఆందోళన చేపడుతోన్న యువతకు సంఘీభావం తెలుపుతూ కాంగ్రెస్ పార్టీ దేశ రాజధానిలో 'సత్యాగ్రహం' చేపట్టింది. దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద కొనసాగుతోన్న ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ, ఏఐసీసీ వర్కింగ్ కమిటీ సభ్యులతోపాటు పార్టీకి చెందిన ఇతర సీనియర్లు పాల్గొన్నారు.

ఎఫ్ఐఆర్ నమోదైతే..అంతే

(మొదటిపేజీ తరువాయి)

అభిప్రాయపడ్డారు. అయినప్పటికీ రెగ్యులర్ సైనికుల మాదిరిగానే అగ్నివీరులకు భత్యం ఉంటుందని, సర్వీస్ నిబంధనల్లో ఎటువంటి వ్యత్యాసం ఉండదన్నారు. నేవీలో అగ్నివీరులుగా మహిళలను నియమించుకుంటామని వైస్ అడ్మిరల్ దినేశ్ త్రిపాఠి వెల్లడించారు. నవంబర్ 21 నుంచి నేవీలో అగ్నివీరుల శిక్షణ మొదలవుతుందని తెలిపారు. వాయుసేనలో డిసెంబర్ 30 నుంచి అగ్నివీరుల తొలి బ్యాచ్‌కు శిక్షణ ప్రారంభమవుతుందని ఎయిర్ మార్షల్ ఎస్‌కే ఝా వెల్లడించారు.

వాయుసేన అగ్నిపథ్ సమాచారం ఇదే

భారత వాయుసేన అగ్నిపథ్ కింద నియామక వివరాలను విడుదల చేసింది. ఈ పథకం కింద వాయుసేన నియామక వివరాలు, నిబంధనలు వెల్లడించింది. అగ్నిపథ్‌ను సాయుధ బలగాలకు సంబంధించి నూతన మానవ వనరుల నిర్వహణ పథకంగా ఐఏఎఫ్ అభివర్ణించింది. త్రివిధ దళాలు నియామక ప్రక్రియలను శరవేగంగా మొదలు పెట్టేస్తున్నాయి. ఈ క్రమంలోనే వాయుసేనలో అగ్నిపథ్ వివరాలను వెల్లడించింది. వాయుసేనలో అగ్నిపథ్ కింద చేరే అగ్నివీరుల పర్యవేక్షణ మొత్తం 1950 వైమానికదళ చట్టం కింద జరుగుతుంది. ఆన్‌లైన్ పరీక్షలు, ఇతర విధానాల ద్వారా ఎంపికలు చేపడతారు. ప్రత్యేకమైన ర్యాలీలు, ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్, ఎన్ఎస్‌క్యూఎఫ్‌లో గుర్తింపు పొందిన టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్లలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. వాయుసేనలో ప్రస్తుతం ఉన్న ర్యాంకులకు భిన్నంగా వీరికి ప్రత్యేకమైన ర్యాంక్ కేటాయించనున్నట్లు వాయుసేన పేర్కొంది. ఇక ఎంపికైన అభ్యర్థులు అన్ని నిబంధనలు పాటిస్తామని సంతకాలు చేయాల్సి ఉంటుంది.

నిబంధనలకు విరుద్ధంగా మాజీ మంత్రులకు అధికారిక భవనాలు

గుజరాత్ కాంగ్రెస్ ఆరోపణ

అహ్మదాబాద్: గుజరాత్‌లోని మాజీ మంత్రులు నిబంధనలకు విరుద్ధంగా అధికారిక నివాసాల్లోనే కొనసాగడాన్ని కాంగ్రెస్ పార్టీ తప్పుబట్టింది. సీఎం విజయ్ రూపానీ మంత్రివర్గంలో పని చేసిన 15 మంది తమ మంత్రి పదవులు పోయినా ప్రభుత్వ బంగ్లాల్లోనే నివసిస్తున్నారంటూ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మనీశ్‌దోషి ఆరోపించారు. ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...బీజేపీ ప్రభుతం అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ మంత్రి పదవులు పోయిన వారికి కూడా అధికారికంగా బంగ్లాల్లోనే ఉండే వీలు కల్పిస్తోందని పేర్కొన్నారు. మంత్రి పదవులు పోయిన వారు ఎమ్మెల్యేలుగానే పరిగణించబడతారని, వారు ఇప్పటికీ మంత్రులకు కేటాయించే నివాసాల్లోనే ఉండడాన్ని తప్పుబట్టారు. అధికారిక నివాసాల్లోనే ఉంటూ ప్రభుత్వం కల్పించే అన్ని సౌకర్యాలను అనుభవిస్తున్నారని తెలిపారు. నెలకు రూ.42 వేల అద్దె విలువ చేసే బంగ్లాలను మాజీ మంత్రులు కేవలం రూ.4,200 చెల్లించి అనుభవిస్తున్నారని పేర్కొన్నారు. మంత్రులు తమ పిల్లలు చదువులు ఉన్నాయని బంగ్లాను కొనసాగించాలని ప్రభుత్వాన్ని కోరినట్టు తెలుస్తోందని తెలిపారు. నిజానికి వారెవరికీ పాఠశాలలకు వెళ్లే పిల్లలు లేరని పేర్కొన్నారు. ఇది పూర్తిగా నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ చేసిన ఈ ఆరోపణలను అధికార బీజేపీ కొట్టిపారేసింది.

ప్రభుత్వ నిబంధనల ప్రకారమే నివాసాలను కేటాయించినట్టు పేర్కొంది. ఈ వ్యవహారంపై స్పందించిన మాజీ విద్యా మంత్రి భూపేంద్రసింగ్ మాట్లాడుతూ...నిబంధనల ప్రకారమే బంగ్లాల కేటాయింపు జరిగిందని చెప్పారు. తనతో పాటు చాలా మంది మాజీ మంత్రులకు నిబంధనల మేరకు అద్దె నిర్ణయించినట్టు వివరించారు.

అగ్నివీర్‌లకు బీజేపీ ఆఫీసుల వద్ద కాపలా ఉద్యోగాలు

బీజేపీ జాతీయ కార్యదర్శి కైలాశ్ విజయవర్గీయ

మండిపడుతున్న యువత



ఇండోర్: దేశ వ్యాప్తంగా యువత అగ్నిపథ్ పథకానికి వ్యతిరేకంగా ఆగ్రహం వ్యక్తం చేస్తుంటే బీజేపీ నేతలు వారి ఆందోళనల్ని మరింత రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేస్తున్నారు.

కేంద్ర మంత్రి జీ కిషన్‌రెడ్డి అగ్నిపథ్ శిక్షణలో బట్టలుతకడం, హెయిల్ కటింగ్ వంటి పనులను కూడా నేర్పుతారని, నాలుగేళ్ల అనంతరం ఆ పనులు చేసుకుని కూడా అగ్నివీర్‌లు జీవనోపాధి పొందే అవకాశం ఉంటుందంటూ చేసిన వ్యాఖ్యలు దేశ వ్యాప్తంగా వివాదాస్పదమయ్యాయి. కిషన్‌రెడ్డి వ్యాఖ్యలపై యువత సామాజిక మాధ్యమాల్లో ఆగ్రహం వ్యక్తం చేస్తుంటూ బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కైలాశ్ విజయవర్గీయ ఇదే తరహాలో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. శనివారం ఆయన ఇండోర్‌లో మీడియాతో మాట్లాడుతూ అగ్నిపథ్ పథకం కింద అగ్నివీర్ ఉద్యోగం పొంది నాలుగేళ్లు పని చేసిన అనంతరం వారికి భారతీయ జనతా పార్టీ (బీజేపీ) కార్యాలయాల వద్ద కాపలాదారు (సెక్యూరిటీ గార్డులు) ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా తమ కార్యాలయాల వద్ద అవసరమైన కాపలాదారుల కోసం తాను అగ్నివీర్‌లకే అధిక ప్రాధాన్యత ఇస్తానని వ్యాఖ్యానించారు.

విజయవర్గీయ చేసిన ఈ వాఖ్యలు దేశ వ్యాప్తంగా విస్తృతంగా ప్రసారం అవడంతో యువత భగ్గుమంది. ప్రతిపక్షాలు సైతం అగ్నిపథ్ విషయంతో బీజేపీ నేతలు అసలు స్వరూపం బయటపడుతోందని వ్యాఖ్యానించాయి. దేశంలోని నిరుద్యోగ సమస్యలను తీర్చడంలో ప్రధాని మోదీ ఘోరంగా విఫలమైతే ఆ పార్టీకి చెందిన జాతీయ ప్రధాన కార్యదర్శి యువతకు సెక్యూరిటీ గార్డుల పని ఇస్తామంటూ అవమానించారని కాంగ్రెస్ పార్టీ నేత, మధ్యప్రదేశ్ మీడియా ఇంచార్జి కేకే మిశ్రా ధ్వజమెత్తారు.

కార్మిక హక్కులు హరిస్తున్న పాలకులు

- జులై ఒకటిన కలెక్టరేట్ల వద్ద ఆందోళన
- 2నుంచి మున్సిపల్ ఉద్యోగుల సమ్మె
- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్

జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

విశాలాంధ్ర-అనంతపురం అర్బన్: పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులు, చట్టాలను ప్రధాని నరేంద్రమోదీ, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కాలరాస్తున్నారని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ విమర్శించారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల ఏఐటీయూసీ మహాసభలు ఆదివారం నగరంలోని జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బయన్న, నాయకులు గోవిందు, కృష్ణుడు అధ్యక్షతన జరిగిన సభకు రావులపల్లి రవీంద్రనాథ్, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల సీపీఐ కార్యదర్శులు జాఫర్, వేమయ్య యాదవ్, సహాయ కార్యదర్శి నారాయణ స్వామి హాజరయ్యారు. ముందుగా ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించారు. ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయప్ప బృందం విప్లవ గీతాలు ఆలపించింది. రవీంద్రనాథ్ మాట్లాడుతూ మోదీ, జగన్ ప్రభుత్వాలు కార్మిక కుటుంబాలకు శాపంగా మారాయని విమర్శిం చారు. ఏఐటీయూసీ అధ్వర్యంలో పోరాడి సాధించుకున్న 44 చట్టాలను 4 బార్ కోడ్లుగా మార్చడం మోదీ నిరంకుశత్వానికి నిదర్శనమని మండిపడ్డారు. 8 గంటల పనిదినాన్ని మోదీ 12 గంటలకు మార్చే దుర్మార్గపు ఆలోచన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇందుకు నిరసనగా జులై 1న కలెక్టరేట్ల వద్ద కార్మిక సంఘాలు ఆందోళన చేపట్టాలన్నారు. మోదీ అవలం బిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను కార్మిక సంఘాలు, ఫెడరేషన్లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయన్నారు. మోదీ పాలనలో కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు సైతం ఉండబోవన్నారు. మోదీ చేతిలో జగన్ కీలుబొమ్మగా మారారని ఆరోపించారు. వ్యవసాయ పంపుసెట్లకు జగన్ ప్రభుత్వం విద్యుత్ మీటర్లు బిగిస్తున్నదని మండిపడ్డారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా చేస్తానన్న హామీని జగన్ విస్మరించారని విమర్శించారు. సమస్యలపై గళమెత్తడానికి రోడ్డెక్కితే ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధాలు నిత్యకృత్యమయ్యాయన్నారు. మున్సిపల్ కార్మికుల వేతనాల్లో కోతలు విధిస్తూ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. కనీస వేతనాల సాధన కోసం జులై 2 నుండి రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు సమ్మెకు దిగుతున్నారన్నారు. సభలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి, ఉప ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, నగర అధ్యక్షుడు రాజేశ్ గౌడ్, నాయకులు రామకృష్ణ, మహేశ్, శ్రీనివాసులు, ఆటో వర్కర్లు, హమాలీలు, మెడికల్ సిబ్బంది, భవన నిర్మాణ, మున్సిపల్ కార్మికులు, అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, వివిధ రంగాల కార్మికులు పాల్గొన్నారు.

పునర్విభజన ఉత్తర్వులు రద్దు

ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉపాధ్యాయుల పునర్విభజన ఉత్తర్వులు-117ను వెంటనే ఉపసంహరించాలని, లేకుంటే వేలాది ఉపాధ్యాయ పోస్టులు రద్దయ్యే ప్రమాదముందని ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి 20 నుంచి 30కి పెంచడం, 80మంది విద్యార్థులకు ఉన్న ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుల ఖాళీని 120 మంది విద్యార్థులు ఉంటేనే మంజూరు నిబంధనలు ఉండడం తగదన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలో 40 మంది విద్యార్థులకు ఉన్న స్కూల్ అసిస్టెంట్లను 92 ఉంటేనే కేటాయిస్తామని చెప్పడంతో ఉపాధ్యాయ ఖాళీలు రద్దవుతాయని వివరించారు. 50మంది విద్యార్థులకు ఒక ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయుడు, వ్యాయామ విద్య ఖాళీకి 98 ఉంటేనే ఇస్తామని నిబంధన విధించడం తగదన్నారు. ఉపాధ్యాయులకు ఉన్న సరాసరి 32 పీరియడ్ల నుంచి 55 పెంచడం వలన, గతేడాది ఆరో తరగతిలో జరిగిన ప్రవేశాలు మాత్రమే పరిగణలోకి తీసుకుని, 7 నుంచి 10 తరగతుల వరకు జరిగిన ప్రవేశాలను పరిగణలోకి తీసుకోకపోవడం వల్ల వేలాది ఉపాధ్యాయ ఖాళీలు రద్దవుతున్నాయని తెలిపారు. రాష్ట్రం మొత్తం మీద కర్నూలు జిల్లా తప్ప మిగిలిన అన్ని జిల్లాల్లోనూ ఈ ఉత్వర్వులతో ఖాళీలు రద్దవ్వడంతో, విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతుందని వెంటనే ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పురపాలక ఉపాధ్యాయుల బదిలీలు విడుదల చేయాలి

నిలుపుదల చేసిన పురపాలక, నగరపాలక సంస్థ ఉపాధ్యాయుల బదిలీలు ప్రక్రియను వెంటనే విడుదల చేయాలని ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. సమయం సరిపోలేదన్న కారణంతో ఇచ్చిన ప్రణాళికలను నిలుపుదల చేశారని, బదిలీల గడువును ఈ నెలాఖరవరకు పొడిగించినందున వెంటనే బదిలీలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎనిమిదేళ్లుగా బదిలీలకు నోచుకోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఉపాధ్యాయుల బదిలీలు షెడ్యూల్ ఆ శాఖ కార్యదర్శి విడుదల చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

పవన్ నోట 'బాబు' మాట

మాజీ మంత్రి పేర్ని నాని ధ్వజం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జనసేన నాయకుడు పవన్ కల్యాణ్ నోట చంద్రబాబు మాటలే విన్పిస్తున్నాయని, ఆయనకంటూ ఒక లక్ష్యం, గమ్యం లేదనీ మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య(నాని) ధ్వజమెత్తారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మళ్లీ జగన్‌కు ఎక్కడ మేలు జరుగుతుందనే ఆందోళనతో, 2024 ఎన్నికల్లో చంద్రబాబు చెంతనే పవన్ జతకట్టి, టీడీపీకి మేలు చేసేందుకు బయటకు వస్తున్నారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా పవన్ బాధ్యతతో రాజకీయాలు చేయాలని హితవు పలికారు. అధికారంలోకి వచ్చిన మూడేళ్లల్లో 90శాతానికిపైగా హామీలను అమలు చేసిన ఘనత, దేశంలో ఒక్క జగన్ ప్రభుత్వానికే ఉందని స్పష్టం చేశారు.

మోదీపై పెరుగుతున్న వ్యతిరేకత

అగ్నిపథ్‌పై జగన్ వైఖరి స్పష్టం చేయాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రావుల వెంకయ్య

మాట్లాడుతున్న రావుల వెంకయ్య. పక్కన మధు, రాంబాబు, రామారావు, కొండలరావు తదితరులు

విశాలాంధ్ర-రాజమహేంద్రవరం: దేశవ్యాప్తంగా ప్రధాని నరేంద్ర మోదీపై వ్యతిరేకత పెరుగుతోందని, ఇప్పటికైనా ప్రజావ్యతిరేక విధానాలను వీడకపోతే మూల్యం చెల్లించక తప్పదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు రావుల వెంకయ్య తెలిపారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్రం ఇప్పటికే ప్రభుత్వ సంస్థల్ని ప్రైవేటీకరణ చేస్తూ ప్రభుత్వ రంగాన్ని, ప్రభుత్వ రంగ సంస్థలని నిర్వీర్యం చేస్తోందని, ఎన్నికలకు ముందు ఉద్యోగాలు కల్పిస్తామంటూ యువతను మోసం చేసిన కేంద్ర ప్రభుత్వం విధానాలపై దేశవ్యాప్తంగా యువత విసిగి పోయి ఆగ్రహంతో ఉన్నారని, అందుకే భారీగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయన్నారు. దేశానికి కీలకమైన రక్షణ రంగాన్ని కూడా ప్రైవేటు పరం చేసేందుకు తాజాగా అగ్నిపథ్ పేరుతో విడుదల చేసిన పథకంపై బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఇప్పటికే పెద్ద ఎత్తున ఆందోళనలు జరుగుతున్నాయన్నారు. ఏపీ సీఎం జగన్ అగ్నిపథ్‌కు అనుకూలమా? వ్యతిరేకమా? అనేది స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా రాష్ట్రపతి ఎన్నికలపై కూడా తన స్పష్టమైన వైఖరిని వ్యక్తం చేయాలని కోరారు. కోనసీమలో రైతులు క్రాప్ హాలిడేకు సిద్ధమవుతున్న నేపథ్యంలో సీఎం జగన్ కోనసీమలో పర్యటించి ఆయా గ్రామాల రైతులతో మాట్లాడి సమస్యకు పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాలపై ప్రభుత్వం కక్షసాధింపు చర్యలు మానుకోవాలని, లేనిపక్షంలో ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. రాష్ట్ర మాజీ మంత్రి అయ్యన్న పాత్రుడు భవనం గోను కూల్చివేయడాన్ని దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించే ఇటువంటి చర్యలను సీపీఐ ఖండిస్తుందన్నారు. అదేవిధంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరుతో అంబేద్కర్ కోనసీమ జిల్లా తక్షణం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు, జెట్ల లేబర్ యూనియన్ ప్రెసిడెంట్ కూండ్రపు రాంబాబు, రేకా భాస్కర్ రావు, సీపీఐ నగర కార్యదర్శి నల్లా రామారావు, నగర సహాయ కార్యదర్శి వంగమూడి కొండలరావు, నగర కార్యవర్గ సభ్యుడు బొమ్మసాని రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి వస్తే 2.5లక్షల ఉద్యోగాలు

దసరా వరకూ చూస్తాం... తర్వాత మీ సంగతి చెప్తాం

వైసీపీ నేతలపై జనసేన చీఫ్ పవన్ కల్యాణ్ ఫైర్

విశాలాంధ్ర-పర్చూరు: వైసీపీ నాయకులకు దోచుకునే సత్తా ఉన్నప్పుడు.. జనసేనకు 2.5లక్షల ఉద్యోగాలు ఇచ్చే సత్తా ఉండదా? అని ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. కౌలు రైతు భరోసా యాత్రలో భాగంగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆదివారం బాపట్ల జిల్లాలో పర్యటించారు. 80 మంది కౌలు రైతులకు రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా పర్చూరులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పవన్ కల్యాణ్ మాట్లాడారు. 'యువకులకు ఏదైనా ఉద్యోగం రావాలంటే ఎలాంటి క్రిమినల్ కేసులు ఉండకూడదు. కానీ, క్రిమినల్ కేసులు ఉన్న వారు ఎమ్మెల్యేలు ఎలా అవుతున్నారు? ప్రజా ప్రతినిధులకు ఒక రూల్.. సామాన్యులకు మరొక రూలా? ఒకసారి గెలిస్తే ఐదేళ్లపాటు ఏం చేయలేరనే ధీమాతో ఉన్నారు. సరిగా పనిచేయకపోతే రెండేళ్ల తర్వాత రీకాల్ చేసే విధంగా చట్టం రావాలి. సీఎం కాకపోతే రాజకీయాల్లోంచి వెనక్కి వెళ్లి పోయేందుకు పార్టీ పెట్టలేదు. సరిగా పనిచేయకపోతే సీఎం చొక్కా పట్టుకునే విధంగా యువకులను తయారు చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చా. రూ.5లక్షల కోట్లు అప్పు తెచ్చారు. ఏం చేశారని వైసీపీ ఎమ్మెల్యేలను అడగండి. రైతులకు రూ.2వేల కోట్లు ఇచ్చామని చెబుతున్నారు... ఏ జిల్లాకు ఎంత ఇచ్చారో వివరంగా చెప్పరు. 2024లో మళ్లీ వైసీపీ అధికారంలోకి వస్తే రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతుంది. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిని మానసికంగా హింసిస్తున్నారు. రాజకీయ కక్ష తీర్చుకోవడానికి మాత్రమే అధికార యంత్రాంగాన్ని వినియోగిస్తున్నారు కానీ, కౌలు రైతుల కష్టాలు తీర్చేందుకు ఉపయోగించడంలేదు" అని పవన్ విమర్శించారు.

అధికారంలోకి రాగానే ఉద్యోగ క్యాలెండర్

'జనసేన అధికారంలోకి రాగానే జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తాం. రైతులకు గిట్టు బాటు ధర కల్పిస్తాం. చాలాసార్లు ఇతరులకు అవకాశం ఇచ్చారు. ఈసారి జనసేనకు అవకాశం ఇవ్వండి. విభజన జరిగినప్పటి నుంచి రాష్ట్రానికి అన్యాయం జరుగుతోంది. కేంద్రాన్ని నిందించడం కాదు.. మన బంగారం మంచిదవ్వాలి. వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు ఇవ్వాలని మన ఎంపీలు గట్టిగా అడగరు. ఢిల్లీలో కూర్చుని వ్యాపారాలు చేసుకుంటారు. బాధ్యతగల వ్యక్తుల్ని ప్రజాప్రతినిధులుగా ఎన్నుకున్నప్పుడే ఈ రాష్ట్రం బాగుపడుతుంది. కొత్తతరం నాయకులు రాజకీయాల్లోకి రావాలి. ఒకసారి అందరూ జనసేన వైపు చూడింది. పార్టీ పెట్టినప్పటి నుంచి మాకు ప్రతికూల పరిస్థితులే. అయినా, ఎక్కడా వెనక్కి తగ్గలేదు.

ప్రకాశం జిల్లాను మార్చేందుకు మహిళలు కొంగు బిగించాలి. పొత్తుల గురించి మాట్లాడే సమయం కాదు. పొత్తు ప్రజలతోనే ఇంకెవరితోనూ లేదు. 2009లో ఏం చెప్పానో అదే చేస్తా. ప్రజలకోసం, ప్రత్యేక హోదాకోసం ప్రధాన మంత్రితో విభేదించా. వ్యక్తిగతంగా నష్టపోయా. రాజకీయాల్లో ప్రజలు ముందు కెళ్లేలా చేయడమే నా తపన. నాకు ఎలాంటి వ్యక్తిగత స్వార్థం లేదు. దసరా తర్వాత వైసీపీ నాయకుల సంగతి చూస్తాం. అప్పటి వరకు మీరేం మాట్లాడినా భరిస్తాం" అని పవన్ కల్యాణ్ అన్నారు. కార్యక్రమంలో పార్టీ పీఏసీ చైర్మన్ నాదేండ్ల మనోహర్, రాష్ట్ర నాయకులు పోలిశెట్టి సత్య, రాయపాటి అరుణ, పెదపూడి విజయకుమార్, ఆలా అనిల్‌కుమార్, రియాజ్, చిరంజీవి, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

'సింహాచలం' పోరాటం స్ఫూర్తిదాయకం

మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్

సింహాచలం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న విల్సన్, శంకర్, జి.కోటేశ్వరరావు, రాయప్ప తదితరులు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): కార్మిక నేత తుపాకుల సింహాచలం పోరాటం స్ఫూర్తిదాయకమని మాజీ ఎమ్మెల్సీ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్ అన్నారు. విజయవాడ నగరం వించిపేటలోని వద్దాది రమణ స్థూపం వద్ద తుపాకుల సింహాచలం 22వ వర్ధంతి తుపాకుల నాగేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం జరిగింది. జల్లి విల్సన్, సీపీఐ నగర కార్యదర్శి దోనేపూడి శంకర్ హాజరయ్యారు. జల్లి విల్సన్ మాట్లాడుతూ రెల్లి వర్గం నుండి వచ్చిన తుపాకుల సింహాచలం కార్మికుల సమస్యల కోసం నిత్యం కృషి చేశారన్నారు. తెల్ల వారుజామునుండే నగరంలోని అన్ని డివిజన్‌లలో ఆయన పర్యటించే వారని, కార్మికుల సమస్యలు తెలుసుకోవడమే కాకుండా పరిష్కారానికి కృషి చేశారన్నారు. ఏఐటీయూసీతో కలిసి ఆయన అనేక పోరాటాలు చేశారన్నారు. అలాంటి నాయకుడిని గుర్తుచేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. విజయవాడ రెల్లి కాలనీకి ప్రత్యేక చరిత్ర ఉందన్నారు. దోనేపూడి శంకర్ మాట్లాడుతూ తుపాకుల సింహాచలం మున్సిపల్ కార్మిక రంగంలో గొప్ప కార్మికనేత అని, సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా, సామాజిక న్యాయం కోసం జరిగిన పోరాటాల్లో కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. ఒకపక్క యూనియన్, మరోపక్క కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలో పాలు పంచుకున్నారని, ఈ ప్రాంతాన్ని కమ్యూనిస్టు పార్టీకి బలమైన కేంద్రంగా తయారు చేయడంలో ఆయన ముందున్నారని తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్ బ్యాంక్ ఎన్నికల్లో కార్మికులను చైతన్యం చేయడం, ఆయన కృషితోనే 30 ఏళ్లుగా బ్యాంక్ ఎన్నికల్లో ఎర్రజెండా జైత్రయాత్ర సాగిందన్నారు. మట్టిలో మాణిక్యమైన సింహాచలం ఆశయసాధన కోసం అందరూ కృషి చేయాలన్నారు. సింహాచలం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ నగర సహాయ కార్యదర్శి జి.కోటేశ్వరరావు, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బుట్టి రాయప్ప, సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు సంగుల పేరయ్య, తాడి పైడియ్య, ఏఐటీయూసీ నగర అధ్యక్షుడు మూలి సాంబశివరావు, సహాయ కార్యదర్శి తుపాకుల ప్రతాప్‌కుమార్, సీనియర్ నాయకులు భూపతి గురుమూర్తి, 55వ డివిజన్‌శాఖ కార్యదర్శి పగిడికత్తుల రాము, మురుగేశన్ రాము, ఏఐవైఎఫ్ నాయకులు లంకేసాయి, తుపాకుల ప్రతాప్, వద్దాది కుంచయ్య, పి.బాజ్జీ, వరప్రసాద్, పి.బాబూరావు, కె.దాసు, వద్దాది బుజ్జి, లీలాప్రసాద్, బి.డేవిడ్, సయ్యద్ హాకీం, మోకా దుర్గారావు, పిట్ట అప్పారావు, టీడీపీ నాయకులు తుపాకుల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అయ్యన్న తప్పు చేస్తే... బీసీలపై రుద్దడం ఏమిటి?

మంత్రి కారుమూరి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అయ్యన్నపాత్రుడి వ్యవహారంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందని, ఆయన తప్పు చేస్తే దాన్ని బీసీలపై రుద్దడం ఏమిటంటూ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ప్రశ్నించారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. వెన్నుపోటు రాజకీయాలకు చిరునామాగా చంద్రబాబు నిలుస్తారని విమర్శించారు. బీసీ నేతలు తప్పు చేస్తే వదిలేయాలా?, అయ్యన్నపాత్రుడు కబ్జాలపై చూస్తూ ఊరుకోవాలా? అని ప్రశ్నించారు. టీడీపీ నేతలు మహిళలు, ఎస్సీల గురించి దారుణమైన వ్యాఖ్యలు చేశారని, గతంలో బాలకృష్ణ మహిళలపై ఎంతటి దారుణ వ్యాఖ్యలు చేశారో చూశామన్నారు. బుద్ధా వెంకన్న పది ఇళ్లు కూల్చుతానంటున్నారనీ, బెజవాడలో మహిళలతో కాల్ మనీ సెక్స్ రాకెట్ నడిపిన చరిత్ర అతనిదని పేర్కొన్నారు. రిషితేశ్వరి, వనజాక్షిపై దాడి జరిగిన కేసుల్లో చంద్రబాబు ఏం చేశారో ప్రజలంతా చూశారన్నారు. జగన్ వచ్చాకే బీసీలకు పూర్తిస్థాయి న్యాయం జరుగుతోందని, చంద్రబాబు బీసీలను ఓట్లేసే యంత్రాలుగానే చూశారన్నారు. కేంద్రంపై టీడీపీ పోరాటం చేయలేకే జగన్‌ను విమర్శిస్తున్నారంటూ చంద్రబాబుపై మండిపడ్డారు. ఉత్తరాంధ్రలో చంద్రబాబు సభకు వచ్చిన జనం జై జగన్ అంటున్నారనీ, జగన్‌పై పోరాటానికి టీడీపీ వారే రావడం లేదని విమర్శించారు.

17న విజయవాడలో రాష్ట్ర సదస్సు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జాతీయ విద్యా విధానం-2020 రద్దు చేయాలని డిమాండు చేస్తూ సామాజిక ఉద్యమాన్ని నిర్మించనున్నట్లు, దీనిపై జులై 17న విజయవాడలో రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు పీడీఎఫ్ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. యూటీఎఫ్ అధ్వర్యంలో జాతీయ విద్యా విధానం-ప్రత్యామ్నాయాలు అంశంపై యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఆదివారం సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగంలో తెస్తున్న మార్పులు విద్యార్థులకు, ఉపాధ్యాయులకు తీవ్ర నష్టాన్ని కలిగించేవిలా ఉన్నాయన్నారు. జాతీయ విద్యా విధానం, బైజూస్ సంస్థతో ఒప్పందం అమలు తదితర సంస్కరణలతో రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. జీవో 117తో ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని, పాఠశాలలు కుదించుకు పోయే పరిస్థితి నెలకొందన్నారు. జాతీయ విద్యావిధానం-2020 రద్దు చేయాలని, జులై 17న రాష్ట్ర స్థాయి విద్యా సదస్సు నిర్వహించాలని రౌండుటేబుల్ సమావేశం తీర్మానించింది. ఈ సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కృషి, పట్టుదలతో క్రీడల్లో రాణింపు

సాఫ్ట్‌బాల్ సంఘం ఏపీ సీఈఓ వెంకటేశులు

పురుష, మహిళల జిల్లా జట్ల ఎంపిక

విశాలాంధ్ర-రాప్తాడు: చదువుతోపాటు కృషి, పట్టుదల, ప్రతిభ ఉంటే క్రీడల్లో రాణించవచ్చని సాఫ్ట్‌బాల్ సంఘం ఏపీ సీఈఓ సి. వెంకటేసులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.నాగేంద్ర, ఉపాధ్యక్షులు జి. రామకృష్ణ, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎ. రవికుమార్ ఆకాంక్షించారు. ఈనెల 30 నుంచి జులై 2 వరకు శ్రీకాకుళం జిల్లా ఆర్ట్స్ కాలేజ్ క్రీడామైదానంలో జరగనున్న రాష్ట్ర స్థాయి సీనియర్ సాఫ్ట్ బాల్ పోటీల్లో పాల్గొనే అనంతపురం జిల్లా పురుష, మహిళల జిల్లా జట్లను ఆదివారం అనంతంపురం లోని ఆర్డీటీ క్రీడా మైదానంలో ఎంపిక చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి 200 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, క్రీడాకారులు అత్యంత ప్రతిభను కనబరిచి రాష్ట్ర జట్టుకు ఎంపిక కావాలని, ఆర్డీటీ సూచనల మేరకు నడుచుకోవాలని సూచించారు. పోటీల్లో గెలుపొంది ఆర్డీటీకి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని కోరారు. క్రీడా సర్టిఫికెట్ ఉంటే ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడానికి స్పోర్ట్స్ కోటాలో రెండు శాతం రిజర్వేషన్ ఉంటుందన్నారు. ఎంపికైన జిల్లా జట్లకు ఈనెల 22 నుంచి ఆర్డీటీ స్టేడియంలో శిక్షణ ఉంటుందన్నారు. పిడిలు ఎన్.కేశవమూర్తి, బి.ప్రభాకర్, బి.రమేష్, చంద్రశేఖర్, పక్కీరప్ప, రాజేంద్రప్రసాద్, కోచ్‌లు సంధ్య, రేణుక, జగదీష్, సాయిదీక్షిత్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే 'అగ్నిపథ్' రద్దు

ఏఐవైఎఫ్ రాష్ట్ర, అధ్యక్ష కార్యదర్శులు పరుచూరి రాజేంద్ర, నక్కి లెనిన్ బాబు విజ్ఞప్తి

మాట్లాడుతున్న లెనిన్‌బాబు. పక్కన రాజేంద్ర, పెంచలయ్య, రవి, ఉదయ్ తదితరులు

విశాలాంధ్ర-తిరుపతి : కేంద్రప్రభుత్వం ప్రవేశ పెట్టిన అగ్నిపథ్ పథకం దేశంలోని లక్షలాది మంది నిరుద్యోగ యువతకు శాపంగా మారుతుందని, దేశ రక్షణను పణంగా పెట్టే అగ్నిపథ్ పథకాన్ని వెంటనే రద్దు చేసి పాత పద్ధతిలోనే ఆర్మీ నియామకాలు చేపట్టాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పరుచూరి రాజేంద్ర, నక్కి లెనిన్ బాబు డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ తిరుపతి జిల్లా జనరల్ బాడీ సమావేశం స్థానిక బైరాగి పట్టెడలోని ఎస్టీయూ కార్యాలయంలో నగర అధ్యక్షుడు రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. మాజీ యువజన నాయకులు ఎ. రామానాయుడు పతాక ఆవిష్కరణ చేసి సమావేశాన్ని ప్రారంభించగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పరుచూరి రాజేంద్ర బాబు, నక్కి లెనిన్ బాబు ముఖ్య అతిథులుగా హజరయ్యారు. దేశ రక్షణ వ్యవస్థను సైతం ప్రైవేటీకరణకు పూనుకోవడం మోదీ ప్రభుత్వానికే చెల్లిందని, కేవలం నాలుగేళ్లు మాత్రమే ఉపయోగించుకుని తర్వాత ఇంటికి పంపి వారికి ఎటువంటి పెన్షన్, ఇతర సదుపాయాలు లేకుండా చేయడం చూస్తుంటే బీజేపీకి దేశ రక్షణ పట్ల ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోందన్నారు. అగ్నిపథ్‌పై నిరసనలు వ్యక్తమైనా కేంద్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రక్షణ శాఖలో ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సీఎం జగన్ జాబ్ క్యాలెండర్ ప్రకటించి సంవత్సరం గడుస్తున్నా ఇప్పటికీ ఒక్క ఉద్యోగం కూడా భర్తీ చేయలేదనీ విమర్శించారు. మాజీ నాయకులు మురళి, విశ్వనాథ్, ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి పెంచలయ్య, జిల్లా కన్వీనర్ కత్తి రవి, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉదయ్, బండి చలపతి, శశి కుమార్, మహేష్‌లతో పాటు పెద్ద ఎత్తున యువత పాల్గొన్నారు. ఇటీవల భారత కమ్యునిస్టు పార్టీ సీపీఐ తిరుపతి జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన యువజన సంఘ మాజీ నాయకులు మురళి, ఏపీ ప్రజా నాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన కళాకారుడు పెంచలయ్యలకు యువజన నాయకులు పెద్ద ఎత్తున ఘనంగా సన్మానం చేశారు.

మోదీ విధానాలు అప్రజాస్వామికం

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: ప్రధాని నరేంద్ర మోదీ విధానాలు అప్రజా స్వామికమని, కార్మిక వర్గాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలలో భాగమే ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రైవేటీకరణ అని ఉక్కు పరి రక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ, నాయకులు గంధం వెంకట్రావు ,బొడ్డు పైడిరాజు అన్నారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపడుతున్న రిలే దీక్షలు ఆదివారం 493వ రోజుకు చేరుకున్నాయి.

ఉక్కు కర్మాగారంలోని వివిధ విభాగాలకు చెందిన కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు. పోరాట కమిటీ నేతలు మాట్లాడుతూ, ఈనెల 26 న జరిగే మహా ప్రదర్శనలో ఉక్కు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపు నిచ్చారు. మహా ప్రదర్శన విజయ వంతం చేసి మోదీకి కనువిప్పు కలిగించాలని అన్నారు. ఉక్కు కర్మాగారాన్ని రక్షించుకోవాలంటే ప్రతి ఒక్కరూ ఉద్యమంలో భాగస్వాములు కావాలని అన్నారు. కార్మిక నేతలు కరణం సత్యారావు, కె.ఎస్.ఎన్ రావు, కె.రాజ బాబు, మంత్రి రవి తదితరులు పాల్గొన్నారు.



మనిషి ఓ మాంసపుముద్ద..

ఏదో ఒక బాధ రాపిడికి
గొంతు చిరిగి అర్థం చితికి
ఇష్టాలకు విలువుండక
నమ్మకాలు నిలువలేక
చావు తెలిసొస్తుంది.

× × ×

చల్లారిన ఊపిరితో
మనిషికి శవమన్న
అంతిమ గౌరవంతో
స్పందనలుండక
రాయభారల్లేక
బతుకు ముగిసేపోతుంది.

× × ×

ఊపిరికి
కళ్ళు, చెవులు, గొంతు
బానిసలు
చావుకు
సంతోషం, నిద్ర, ఆకలి
సమాధులు
జీవితంలో ముసుగు పాత్రలతో
బతుకంతా మగత నడకలే
విషాదాంతాలే...
నిత్యం పొంచిచూసే
మనసనే రుచి లేని
మనిషి ఓ మాంసపుముద్ద....

చివరకు
నంజుకుతింటాడు.
తినబడతాడు అంతే...

శ్రీ సాహితి, 9704437247

సాహితి

జాయిస్ యూలిసిస్సిజ్‌కు వందేళ్లు

చింతపట్ల సుదర్శన్

ప్రపంచ నవలా సాహిత్యంలో అత్యంతాధునిక శిల్పానికి ఆద్యుడు జేమ్స్ జాయిస్. వచన రచనలో జాయిస్ చేసిన వివిధ ప్రయోగాల్లో ప్రధానమైనది చైతన్య స్రవంతి. (stream of conscionsness) ఈ ప్రక్రియ మనిషి మనసులోని ఆలోచనల ప్రవాహానికి అక్షర రూపం ఇస్తుంది. సిగ్మండ్‌ఫ్రాయిడ్, కార్ల్‌యూంగ్, హెన్రీబెర్గ్సన్ వంటి మనస్తత్వ శాస్త్రజ్ఞుల ప్రభావం వల్ల నవలా రచనలో ప్రతిబింబించిన ఈ చైతన్య స్రవంతి అనే పదాన్ని the priniciples of psychology (1890) అనే గ్రంథంలో మొట్టమొదట ఉపయోగించాడు విలియమ్ జేమ్స్.

లండన్‌లోని మోడరన్ లైబ్రరీ 20 వ శతాబ్దపు 100 ఉత్తమ నవలల జాబితాలో మొట్టమొదటి నవల యూలిస్సిజ్. అయితే మూడవది "A portrait of the artist as a youngman" రెండు నవలల రచయితా ఫిబ్రవరి 2, 1882 లో ఐర్లాండులో జన్మించిన జేమ్స్ జాయిసే! గ్రీకులు ట్రోజన్ల మధ్య జరిగిన యుద్ధ పురాణ గ్రంథం Homer రాసిన Odysseus. రోమన్ భాషలో యూలిస్సిజ్ 'యులసీజ్' గా పిలుస్తున్న ఈ నవలలో గ్రీకువీరుడు Odysseus నయుద్ధానంతరం చేసిన సాహసయాత్రకు సమాంతరంగా సామాన్యుడి జీవిత సంఘర్షణను జాయిస్ ఈ నవలలో చిత్రించాడు.

ఆధునిక జీవితపు సంక్లిష్టత మనిషి మనసులోని ఆలోచనల సంఘర్షణ ఈ నవలలో ప్రతిబింబిస్తుంది. లియోపాల్డ్ బ్లూం, మోలీ బ్లూం Stephene Dedalus ఈ నవలలోని ముఖ్యమైన పాత్రలు.

Surrogate తండ్రిని కలుసుకోవడానికి డెడలస్, కొడుకుని చూడటానికి బ్లూమ్ డబ్లిన్ నగర వీధుల్లో సంచరించేటప్పుడు వారి మానసిక ప్రయాణం అక్షర రూపంలో ప్రవహించే ఈ నవల మనిషి ఆలోచనలు స్థల కాలాలకు అతీతమైనవని తెలియచేస్తుంది.

అమెరికన్ పత్రిక "Little Review" లో 1918 నుండి 1920 వరకు సీరియల్‌గా వచ్చిన యూలిస్సిజ్ 1922 లో ప్రచురించారు. శత జయంతి జరుపుకుంటున్న ఈ నవల మొట్టమొదటి గ్రంథం నిడివి 730 పేజీలు, 18 అధ్యాయాల ఈ నవలలో 2,65,000 ల పదాలు ఉపయోగించారు.

20 వ శతాబ్దంలోనే కాదు నేటికీ అధ్యయనం చెయ్యడానికి అత్యంత క్లిష్టమైనదిగా భావించే ఈ నవల కథ కేవలం 24 గంటలకు మాత్రమే సంబంధించినదవడం విశేషం. ప్రధాన శైలి చైతన్య స్రవంతే అయినా పాత్రల మనస్తత్వ చిత్రణకు వివిధ రకాల శైలిని ఉపయోగించటం, ఫ్లాష్‌బ్యాక్ టెక్నిక్, డబ్లిన్ వీధుల చిత్రణ, అరిస్టాటిల్, షేక్స్పియర్, డాంటేలతో పాటు 19 వ శతాబ్దపు సంగీతపు ప్రస్తావన, స్వగతాలు, ప్రశ్నలు సమాధానాలు, దినపత్రికల పతాక శీర్షికలు ఆసక్తి కల్గించే నాటకీయత, పదునైన వ్యంగ్యం పాత్రల మనసుకి దృష్టికి యథాతథంగా రూపం కల్పించిన "audible thinking"యూలిస్సిజ్ ఈనాటికీ అత్యంతాధునిక నవలగా ప్రశంసిస్తున్నారు.

(ఈ వ్యాస రచయిత జాయిస్ నవల 'A portrait of the artist as a youngman' ను 'యువ కళాకారుని ఆత్మగీతంగా' అనువదించారు.)



నా అనారోగ్య విషాద గాథ!



రంగనాయకమ్మ

నేను మూడున్నర నెలల నించీ ఒక రోగంతో మంచం మీదే వున్నాను. ఆస్పత్రుల మంచాల మీద కొన్నాళ్ళూ, ఇప్పుడు ఇంట్లోకి కొన్న ఆస్పత్రి రకం మంచం మీద కూడా కొన్నాళ్ళ నించీ.

ఈ గాథ ఎందుకు? ఇది, ఒక వ్యక్తి రోగం కాదు. ఇది, 'కొత్త వార్త!' ప్రపంచంలో ఈ రోగం కూడా వుందని, 100 మందిలో, 95 మందికి తెలిసి వుండదు. తెలిస్తే, నలుగురైదురికే నేమో! నిన్న మొన్నటి దాకా నాకీ రోగం సంగతి తెలీదు. ఎవర్ని అడిగినా, "ఇదేమ్ రోగం? మాకు తెలీదే!" అంటున్నారు!

ఈ రోగం సంగతి తెలీని వాళ్ళకి కూడా రేపు ఈ రోగం రావొచ్చేమో! ఇది తెలిస్తే, జాగ్రత్తగా వుండగలరేమో, నా లాగా విచారాలతోనే కాకుండా, ధైర్యాలతో కూడా! అందుకే, దీన్ని ఒక కొత్త వార్తగా చెపుదామనిపిస్తోంది. కొన్ని వివరాలతో అయినా, క్లుప్తం గానే చెపుతాను.

ఈ సంవత్సరం లోనే, ఫిబ్రవరి 27వ తారీకున సాయంత్రానికి ఒక వ్యాసం ("మహా రష్యన్ దురహంకారం!") పూర్తి చేసి, గాంధీకి ఇచ్చి, " పత్రిక్కి పంపించు!"అనేసి, పడుకున్నాను.

గాంధీ, "రంగాజీ! ఇప్పుడే పడక? అన్నానికి రావాలి" అన్నాడు. "ఇప్పుడు వొద్దులే. ఆకల్లేదు. నువ్వు తినేసి రా! నాకు నిద్రగా వుంది" అనేసి పావు గంటలో నిద్ర పోయాను.

రాత్రి 10 గంటలు దాటి వుంటుంది. నా కడుపులో పెద్ద బాధ ఏదో మొదలైంది. కెవ్వున అరిచి లేస్తూ, "ఇదేవిటి? ఈ నొప్పేమిటి గాంధీ? డాక్టరు దగ్గిరికి వెళ్ళాలేమో" అన్నాను.

కాస్సేపటికి కొంచెం నిద్ర పట్టింది గానీ, తెల్లవార్లూ కడుపులో పోటే! తెల్లారాక రోజూలా లేవలేదు నేను. ప్రైవేటు అంబులెన్స్ వాళ్ళు, నన్ను అందులో పడుకోబెట్టేశారు! ఇంటికి కిలో మీటరు దూరంలోనే వున్న ఆస్పత్రికి చేరాం. వాళ్ళు సెలైన్ ఎక్కించి, ఏదో ఇంజెక్షన్ చేస్తే, కొంచెం బాధ తగ్గింది. సాయంత్రానికే ఇంటికి చేరాం. నేను మంచం ఎక్కకుండా, కాస్సేపు కుర్చీలో కూర్చున్నాను. తర్వాత స్నానం చేశాను. పొద్దున్న మొహమే కడగలేదు కదా? అన్నానికి కూర్చుంటే, వ్యతిరేకం అయింది. అయినా, కొంచెం పెరుగూ, చిన్నఅరిటి పండూ తిన్నాను.

మళ్ళీ పడుకున్నాను. మళ్ళీ మొదలు! కడుపులో అదే బాధ! "అయ్యో, గాంధీ! ఎలాగ?" అన్నాను అరుస్తూ!

తను కంగారు పడుతూ లేచి, ఫోను పిలుపులు మొదలెట్టీ, ఎవర్నో పట్టుకుని, "ఈ సారి పెద్దాసుపత్రికి వెళ్దాం. చెప్పారు వాళ్ళు" అన్నాడు.

తెల్లవార్లూ అదే కథ! ఇద్దరికీ నిద్ర లేదు. ఆ మధ్యాన్నానికి అంబులెన్స్‌లో, పెద్దాసుపత్రికి చేరాం. ముందు 'ఎమర్జె న్సీ' రూములో చేర్చుకుని, ఒక ఇంజెక్షన్ ఇచ్చారు. నొప్పి తగ్గినట్టు అనిపించింది. తర్వాత ఐ.సి.యు లోకి మార్చి, సీటీ స్కానూ, ఇంకేవో పరీక్షలూ జరిపారు. జరిపి, "కడుపులో బ్లాక్" ని కనిపెట్టారట! రెండో రోజున జరిపిన ఇంకో స్కాన్ లో 'బ్లాక్' పెద్దది అని తేలిందట! దానికి ఆపరేషన్ తప్ప వేరే మార్గం లేదట! కానీ, "83 ఏళ్ళ వయసు పేషెంట్‌కి ఆపరేషనా?" అని చర్చలు జరిపి, "అది తప్పదు మరి" అని తేల్చారు. "రేపు రాత్రికే ఆపరేషన్" అని గాంధీకి చెప్పేశారు. అతను, నాకు చెప్పాడు. 'ధైర్యం! ధైర్యం!' అన్నాడు. నేను కడుపులో బాధకన్నా, ఆపరేషన్ అంటేనే ఇష్టపడ్డాను.

ఆ 'రేపు', మార్చి 3వ తారీకు. ఆపరేషన్‌కి తీసుకు వెళ్ళారు. మా అబ్బాయీ, గాంధీ, ఇద్దరూ బైటే వున్నారట! వాళ్ళని లోపలికి రానివ్వలేదు.

నాకైతే అసలు స్పృహే లేదు. మత్తు ఇంజెక్షన్ ఇచ్చినట్టు అయినా తెలీలేదు. కానీ, అప్పుడు నేను ఆ మత్తులో, "నొప్పి, నొప్పి, నొప్పి" అని అరుస్తున్నానని చాలా సార్లు నాకు కూడా వినపడి, క్రమంగా అది ఆగింది. ఆ ఆపరేషన్ మూడున్నర గంటల పాటు జరిగిందట!

ఆ మర్నాడు ఎప్పటికి తేరుకున్నానో తెలీదు. చేతులకు ఇంజెక్షన్లూ, చేతి లోనించి ఆహారాన్ని పంపే ఏర్పాట్లూ, అన్నీ జరిగాయి.

ఆపరేషన్ బాధ ఏమీ లేదు. పాత నొప్పి పోయింది.

ఆపరేషన్ వల్ల తెలిసింది యేమిటంటే, నా కడుపులో చిన్న ప్రేగులో నించి అర మీటరు భాగాన్ని కత్తిరించి తీసేశారట! అదంతా పాడై వుందట!

అసలు, కడుపు లోకి ఏ ఆహారం అయినా వెళ్తే, అక్కడ అది కాస్సేపు అరిగి, తర్వాత అదంతా చిన్న ప్రేగు లోకి వెళ్ళి పోతుందట! అక్కడ కొన్ని గంటల దాకా ఆగి, అరిగి, తర్వాత ఆహారంలో అరగని రద్దు భాగం అంతా పెద్ద పేగు లోకి పోతుందట! ఆ తర్వాత అది, పాయిఖానా లోకి!

ఇప్పుడు, కడుపులో, చిన్న పేగులో కొంత బాగాన్ని కత్తిరించెయ్యడం వల్ల, ఆహారం నడిచే మార్గం అంతా ఆగిపోయింది!

ఈ పేషెంటు, రోగం లోనించి లేచాక, మళ్ళీ ఏదో ఒకటి తింటుంది కదా? ఆ తిండిలో అరిగే భాగం కాకుండా, మిగతాది ఎటు పోతుంది? – దీనికి, డాక్టర్లు చాలా కాలం కిందటే, దాదాపు 70 ఏళ్ళ కిందటే, కొత్త మార్గం ఏర్పరిచారట! అదేమిటంటే, కడుపు నించే ఒక చిన్న సంచిని ఏర్పరిచారు. ఈ సంచి, ఎప్పుడూ వుండాలని కాదు. కడుపులో రెండో ఆపరేషన్ కూడా చేసి, ఆ సంచిని అవతల పారేసి, తెగి పోయి వున్న చిన్న పేగుని ఒకే వరసగా అంటించి, పాత మార్గాన్ని పునరుద్ధరిస్తారట! అదంతా జరిగేది, రోగి ఆరోగ్యాన్ని బట్టీ, వయసుని బట్టీ అట! ఎప్పటికి అంటే, ఎప్పటికి వీలైతే అప్పటికి!

నా కడుపు మీద ఒక సంచిని అంటించి వుంచే ఏర్పాట్లు చేశారు. ఈ సంచికి ఒక పేరు వుంది. 'స్టోమా సంచి'. (స్టోమా బ్యాగ్!) దీన్ని వారం వారం మార్చాలి! ఇది పది అంగుళాల పొడవూ, 5 అంగుళాల వెడల్పూ వుండొచ్చు. ఈ సంచి పొట్టమీద వున్న వాళ్ళు, వెల్లకిలా మాత్రమే పడుకోవాలి. ఎడమ వేపో, కుడి వేపో తిరిగి పడుకుంటే, సంచి లీకైపోయి, దాంటో వున్న పదార్థం పొట్టమీదకీ, పక్కమీదకీ పడిపోయే ప్రమాదం వుంటుంది.

ఈ సంచికీ, కడుపుకీ సంబంధం ఏమిటంటే, కడుపు లోకి గ్లాసుడు మంచి నీళ్ళు చేరినా, అవి తిన్నగా, కడుపులో పూర్తిగా అరగక ముందే ఆ సంచి లోకి వెళ్ళి పోతాయి! ఈ రోగంలో పడ్డ పేషెంటు, గంటన్నరకు ఒకసారి అయినా తింటూ వుండాలట! రోజుకి 3 గుడ్లు! వాటిలో సగం గుడ్డు మాత్రమే కడుపులో అరుగుతుంది. మిగతావి స్టోమా సంచి లోకి పోతాయి.

కడుపులో నించి ఒక 'తిత్తి' వంటిది కొంచెం బైటికి వుండి, అందులో నించి తిన్నదానిలో చాలా బైటికి ప్రవహిస్తూ వుంటుంది. దానికి అంటుకుని వున్న సంచికి కూడా కన్నం వుండి, అందులో నించే ఆ సంచి లోకి పోతూ వుంటుంది. ఈ సంచిని, గంటన్నరా, 2 గంటలకోసారి ఖాళీ చేసి, క్లీన్ చెయ్యాలి. ఈ పనిని పెద్ద వయసు పేషెంట్ చెయ్యడం సాధ్యం కాదు. కాబట్టి, ఆ పని కోసం, నర్సుని పెట్టుకోవాలి.

మా ఇంట్లో, నా సంచి క్లీనింగ్ కోసం పగలంతా ఒక నర్సూ, రాత్రంతా ఒక నర్సూ, వుండాల్సి వస్తోంది. ఆ నర్సుల్ని పంపే కంపెనీకి ఒక్కొక్క నర్సు కోసం, నెలకి, 60 వేలు ఇవ్వాలని ఒప్పందం. కానీ, ఆ నర్సులకు అదంతా అందదు.

ఇప్పటికి మూడున్నర నెలల నరక యాతన ఇది. నేను, 4 కిలోల ఆహారం తింటే, ఒక్క అర కిలోయే అరుగుతుంది.

ఇక్కడ ఒక మాట! కడుపులో వున్న జబ్బు, ఈ 3 నెలల నించీ కాదు. అంతకు ముందు దాదాపు 2 యేళ్ళ నించే తయారవుతూ వుండి వుంటుంది. దాని వల్ల ఒక లక్షణం వుండేది. నేను రెండేళ్ళ నించీ ఏమీ తినలేక పోతున్నాను. కూరలు నచ్చవు. కొంచెం పెరుగన్నమూ, చిన్న అరిటి పండూ తప్ప, దాన్ని మించిన ఆహారం లేదు. దీన్ని గురించి, 'పెద్ద వయసులో ఇలాగే జరుగుతుంది' అనీ 'ఈ రోజుల్లో కూరగాయలు కల్తీగా పండిస్తున్నారనీ, అందువల్లే కూరల్లో రుచి వుండడం లేద'నీ, ఇంట్లో అనుకోవడం. అప్పుడు కరోనాలో మొదటి రోజులు. ఆస్పత్రులకు వెళ్ళడం ఎప్పుడూ ఇష్టం లేదు. అక్కడ శుభ్రాలు వుండ వనేదే చదువుతూ వుంటాం. సరిగా తినలేక పోతున్నా, కడుపులో బాధ వుండేది కాదు. వైద్యం మాటే లేదు. అదే ఈ పెద్ద రోగం అయింది.

నేను, డాక్టర్లతో అన్నాను, "నాకీ సంచి వైద్యాలు వొద్దండీ. ఇంకా బ్రతకాలని లేదు. మెర్సీ కిల్లింగ్ కావాలి నాకు. నాకు సహాయం చేయండి! మీరు, చేసినట్టు కాదు – అని రాస్తాను" అనేదాన్ని.

డాక్టరు నవ్వి, "ఇది అతి చిన్న జబ్బు. ఇది పెద్ద జబ్బు అయితే, అసలు తీసుకోము. మీరు నెగిటివ్‌గా ఆలోచిస్తున్నారు. రాసుకోండి ఇక్కడే. టేబులూ, కుర్చీ వేయిస్తాను" అన్నారు.

"నేను రాయాలంటే, మీ వంటి పెట్టుబడిదారుల మీదే రాస్తానండీ" అన్నాను.

"అయ్యో! నేను అలా కాదు. జీతంతో పని చేసే వాడినమ్మా!" అన్నారాయన.

"అలాగా? మీ గురించి తెలుసుకోకుండా మాట్లాడేశాను. అయినా, ఆస్పత్రిలో షేర్లు పెట్టే డాక్టర్ల మీదే రాస్తా లెండి!" అంటే, ఆయన నవ్వి, "మీరు నెగిటివ్‌గా ఆలోచిస్తున్నారు" అని మళ్ళీ అనేసి, మంచం దగ్గిర్నించి వెళ్ళి పోయారు.

నేను, తినీ, తినీ, బలం తెచ్చుకుంటేనే, రెండో ఆపరేషన్ చేస్తారట! రక్త పరీక్షల్లో మంచి ఫలితాలు రాకపోతే, అసలు రెండో ఆపరేషన్ జరగదు. జరిగినా, అది నిలబడదు. – ఇదీ ఇప్పటి పరిస్తితి.

ఇదే రోగం వాళ్ళని ఇద్దరు, ముగ్గుర్ని అడిగితే, వాళ్ళకి రెండో ఆపరేషన్లు లేవు. వాళ్ళ జబ్బుల్లో కొన్ని తేడాలు వున్నాయి. ఒకాయన 14 యేళ్ళూ అలాగే ఆ సంచితో తిరిగి, చివరికి చచ్చి పోయాడు. ఒకావిడ 12 యేళ్ళకి పోయిందని ఆమె కొడుకు చెప్పాడు. చిన్న పిల్లలు కూడా ఈ సంచి పెట్టుకుని, స్కూలుకు వెళతారనీ, ఈ జబ్బు వున్న పెద్దవాళ్ళు పనులకు కూడా వెళ్తారనీ డాక్టర్లు చెప్పారు.

ఇదీ, ఇప్పటి నా దశ. ఏసుక్రీస్తుని ప్రార్థించమని, నైట్ డ్యూటీ నర్సు తెగ చెపుతూ వుంటుంది. పగటి డ్యూటీ నర్సేమో షిరిడీ సాయిబాబాని పూజించమంటుంది. నేనేమో 'దేవుడు' వుంటాడని నమ్మను అంటాను.

వారం, వారం రక్త పరీక్షలు! ఫలితాలు, ఒక చోట ఎక్కువా, ఒక చోట తక్కువా!

నాకు నిజంగా బతికే కాలం చాలనే అభిప్రాయం బలపడి పోతోంది! అందరూ నన్ను మందలింపులే.

ఒడిలో చిన్న వయసు పిల్లల్ని కూచోబెట్టుకుని ముద్దు చేసేవాళ్ళు కడుపు మీద చెత్త సంచిని అంటించుకుని మోస్తూ వుండడానికా జీవితం పెంచుకోవలిసింది? – అంటాను. నేను నెగిటివ్ – అని తేల్చేశారు! ఇప్పుడు ఇదీ నా పరిస్తితి! ఇంకా మంచం మీదే! మంచం లో కూర్చునే ఏదో ఒకటి రాస్తూ వున్నాను.

ఈ గాథని విని, ఈ రోగం నించి రేపు ఎవరి జాగ్రత్తలు వాళ్ళు పడాలి.

గ్రంథ సమీక్ష

రచయిత అనుభవాల్లోంచి పుట్టిన 'ఖబర్ కె సాత్' కథలు



ఖబర్ కె సాత్ కథలు,
రచన: శ్రీనివాసమూర్తి, ప్రచురణ: తుంగభద్ర,
వెల: రూ.50/-, అన్ని బుక్ షాపుల్లో లభిస్తుంది.

కోవెల గజం వల్ల మావటికి ఎప్పుడైనా ప్రమాదమే అని తాత మనవడికి చెప్పాడు. డబ్బు కాశింబి ఓటు వేసే వారికి నీతి నిజాయితీలక్కరలేదు. 'అడివోడు నిజంగా అడివోడు కాదు. అన్ని పనులు చేయటం వచ్చు. ఇతరులకు సహాయం చేయటం కనీస ధర్మంగా భావిస్తాడు. 'దొర్లు దొర్లు పుచ్చకాయ' అడవి జంతువు అలుగుకు కంచిగిరికి జరిగిన సంభాషణ ఈ కథ.

'సేద్యం' చేయాలంటే అన్ని కలిసి రావాలి. లేకపోతే బీడు భూమిగా మిగులుతుంది.'మెడ మీద కత్తి' ఫ్యాక్షనిజాన్ని ఆధారం చేసికొని కన్పించింది. జీవితాన్ని ఎలా గడపాలో తెలియక రమేషు కొట్టుమిట్టులాడాడు. రమణి భార్య అని తెలిసినా నానా హింసలపాలు చేశాడు. సంసారం ధ్వంసమయ్యింది. అడవుల్లో ఏనుగుల సంచారం ఎక్కువ. వాటిని అదుపు చేయటం కష్టం. కొందరు ఆ గజాలను చంపేవారు. స్వాములు వచ్చినా ఏమీ చేయలేకపోయాడు. మేనేజ్‌మెంటు కాలేజీల్లో లెక్చరర్ల జీవితాలు గాలి పడగలు లాంటివి. జీవితం ఎలా గడుస్తుందని లెక్చరరు మారుతి ఆవేదన, ఆక్రందన. గ్రామాల్లో అప్పుడప్పుడు శవ రాజకీయాలు జరుగుతుంటాయి. వర్గాలేర్పడతాయి. ఆయా కులపోళ్ల తాము చెప్పిందే న్యాయం అని అంటారు. ఎవరి పని వారు చేసికొంటే ఇబ్బంది ఉండదు. కాని అన్ని పనులు భార్య చేయాలంటే కష్టం. భర్త తోడుంటే భార్యకు కష్టం ఉండదు. ఆఫీసుకు హాయిగా వెళ్లవచ్చు. కాని ప్రసూనకట్టి అదృష్ట యోగం లేదు. కక్షలు కార్పణ్యాలెక్కువయితే ఆ గ్రామం మంటల్లో మాడిపోవాల్సిందే. ఎక్కడ చూసినా మోసమే. అతకని బతుకులు ఆరని అగ్ని జ్వాలలు. పేదల ప్రాణాలతో ఆటలాడుకోవటం ఎక్కువయ్యింది. పేదల బతుకులింతేనా? రచయిత అనుభవాల్లోంచి తొంగి చూసిన కథ 'ఖబర్ కె సాత్'. కశ్మీర్ స్థితిగతులను గూర్చి వాస్తవిక గాథ కథ. 'ఒకానొక సందర్భంలో కాలం చెక్కిన మనిషి, సమాజకృత పిండమా!వికృత పిండమా. నీలోను నాలోను కొంతగానో మెండుగానో నా వెనుక అన్న వాళ్లు చేస్తున్న కర్మ పూర్తి అయినట్టుంది. కృష్ణార్పణమస్తు అంటున్నారు."

గెల్లి రామమోహనరావు, ఫోన్: 0863-2357514

డా. ఎన్. గోపి - రెండు గ్రంథాల ఆవిష్కరణ

ప్రముఖ కవి డా. ఎన్. గోపి 73వ జన్మదినం సందర్భంగా రెండు గ్రంథాల ఆవిష్కరణ జరుగుతుంది. జూన్ 26, 2022 ఆదివారం, సాయంత్రం 5 గంటలకు, హైదరాబాద్ నాంపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో బృహత్కవితా సంపుటి "మనిషిని కలిసినట్టుండాలి", డా. ఎస్. రఘు సంపాదకత్వంలో వెలువడే సాహిత్య విమర్శ, సమీక్షావ్యాసాల ప్రత్యేక గ్రంథం "నిరంతర" గ్రంథాలను ముఖ్య అతిథులు శ్రీ వంగల హర్షవర్ధన్, కె. రామచంద్రమూర్తి గార్లు ఆవిష్కరిస్తారు. ఆచార్య సూర్యా ధనంజయ విశిష్ట అతిథిగా ఉన్న సభకు డా. వోలేటి పార్వతీశం అధ్యక్షత వహిస్తారు. రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేసే సాహితీవేత్తలు ఆప్తవాక్యాలు పలుకుతారు.

- మద్దాళి రఘురాం, కిన్నెర కార్యదర్శి

కోపూరి శ్రీనివాస్ స్మారక సింగిల్‌పేజీ కథల పోటీలు

ఇటీవల పిన్న వయస్సులోనే దివంగతులైన కోపూరి శ్రీనివాస్ పుట్టిన రోజు ఆగస్ట్ 9న సందర్భంగా, ఆయన పేరుతో వారి తల్లిదండ్రులు కోపూరి పుష్పాదేవి, రామచంద్రరావుగార్లు రమ్యభారతి పత్రిక ఆధ్వర్యంలో సింగిల్ పేజీ కథల పోటీలు నిర్వహిస్తున్నారు. ఉత్తమంగా ఎన్నికైన కథలకు–

మొదటి బహుమతి: రూ.1500/-, ద్వితీయ బహుమతి: రూ.1000/-, తృతీయ బహుమతి: రూ.500/-

ప్రోత్సాహక బహుమతులు: 3 కథలకి ఒక్కొక్కటి 300/- చొప్పున ఇవ్వబడతాయి.

సామాజికస్పృహ కలిగిన అంశంతోకథ రాతలో ఎ-4లో పేజీకి మించకుండారాసి (డిటిపిచేసినవి అయితే అరపేజీ మించకూడదు) పంపాలి. కథపై రచయితపేరు, వివరాలు ఉండకూడదు. కేవలం ఆ వివరాలు హామీపత్రం లోనే రాసి **జులై15వ తేదిలోగా 'రమ్యభారతి' పోస్ట్‌బాక్స్‌నెంబర్.5, విజయవాడ-520001** చిరునామాకు పోస్ట్‌ద్వారా మాత్రమే పంపాలి. పోటీలో విజేతలైనవారికి ఆగస్ట్ నెలలో విజయవాడలో జరిగే ప్రత్యేక సభలో బహుమతీ ప్రదానం ఉంటుంది.

- చలపాక ప్రకాష్, ఎడిటర్, రమ్యభారతి

స్పైస్‌జెట్ విమానంలో మంటలు

అత్యవసర ల్యాండింగ్

న్యూఢిల్లీ: స్పైస్‌జెట్ విమానానికి భారీ ప్రమాదం తప్పింది. పాట్నా నుంచి ఢిల్లీ బయలుదేరిన విమానం గాల్లోకి ఎగిరిన కొద్దిసేపటికే ఒక్కసారిగా మంటలు అంటుకోవడం కలకలం రేపింది. పాట్నా విమానాశ్రయం నుంచి టేకాఫ్ అయిన కొద్దిసేపటికే విమానం ఎడమ ఇంజిన్‌ను ఓ పక్షి ఢీకొట్టింది. దీంతో ఇంజిన్‌లో స్వల్పంగా మంటలు చెలరేగినట్లు ప్రయాణికులు గుర్తించారు. దీంతో అప్రమత్తమైన పైలట్లు, విమానాన్ని తిరిగి పాట్నా విమానాశ్రయంలో అత్యవసర ల్యాండింగ్ చేశారు. విమానం సురక్షితంగా ల్యాండ్ కావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. దీనిపై స్పందించిన డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ పక్షి ఢీ కొట్టడం వల్లే మంటలు వచ్చినట్లు వెల్లడించింది. ఈ విషయాన్ని గ్రహించిన వెంటనే ఇంజిన్‌ను ఆపేసిన పైలట్లు.. విమానాన్ని సురక్షితంగా ల్యాండింగ్ చేసినట్లు తెలిపింది.

నకిలీ జాతీయవాదులను గుర్తించండి

కాంగ్రెస్ సత్యాగ్రహంలో ప్రియాంక

న్యూఢిల్లీ: అగ్నిపథ్‌కు నిరసనగా జరుగుతున్న ఆందోళనలకు సంఘీభావంగా కాంగ్రెస్ పార్టీ జంతర్‌మంతర్ వద్ద ఆదివారం సత్యాగ్రహం చేపట్టింది. సాయుధ బలగాల్లో నియామకాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రకటించిన అగ్నిపథ్ పథకాన్ని యువత తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. మోదీ సర్కారు ప్రకటించిన అగ్నిపథ్ పథకం వల్ల దేశ యువతకు ఎంతమాత్రం ప్రయోజనం లేదని కాంగ్రెస్ నాయకులు, మద్దతుదారులు విమర్శించారు. అంతేకాకుండా దేశ భద్రతకు అత్యంత హానికరమని హెచ్చరించారు. సత్యాగ్రహంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ వాద్రా, నాయకులు జైరాం రమేశ్, రాజీవ్ శుక్లా, సచిన్ పైలెట్, సల్మాన్ ఖుర్షీద్, అల్కా లాంబా, ఎంపీలు, సీనియర్ నేతలు తదితరులు పాల్గొన్నారు. నకిలీ జాతీయవాదులను గుర్తించాల్సిందిగా యువతకు ప్రియాంక పిలుపునిచ్చారు. అగ్నిపథ్‌కు వ్యతిరేకంగా శాంతియుతంగా ఆందోళన చేస్తున్న యువతకు తమ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. 'మీకంటే దేశభక్తులు ఇంకెవరున్నారు? నేను మీకో విషయం చెప్పాలనుకుంటున్నాను. అదేమంటే మీరు కళ్లు తెరవండి. నకిలీ జాతీయవాదులు, నకిలీ దేశభక్తులు ఎవరో గుర్తించండి. మీ ఆందోళనలకు యావత్ దేశం, కాంగ్రెస్ పార్టీ అండగా ఉంది' అని

ప్రియాంక పేర్కొన్నారు. హరివంశ్ రాయ్ బచన్ హిందీ కవితను ఉటంకించారు. శాంతియుతంగా ఆందోళనలు చేపట్టాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

దేశ యువతను సర్వనాశనం చేయడానికే కేంద్రం ఈ పథకం తెస్తోందని అన్నారు. సైన్యాన్ని ధ్వంసం చేస్తోంది. ఈ ప్రభుత్వ ఉద్దేశం ఏమిటో అర్థం చేసుకోవాలని సూచించారు. ఈ పథకాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని సచిన్ పైలెట్ డిమాండ్ చేశారు. హింసకు పాల్పడవద్దని, ఈ పథకానికి వ్యతిరేకంగా నిరసనలు తెలపడం మీ హక్కు అని, అయితే, నిరసనలు, ఆందోళనలు శాంతియుతంగా ఉండాలని, హింసకు తావు లేదని హితవు పలికారు. వివాదాస్పద పథకానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా యువత ఆందోళనలు చేస్తోంది. జంతర్‌మంతర్ వద్ద భారీగా పోలీసు బలగాలను మోహరించారు. జంతర్‌మంతర్ ప్రవేశ మార్గాలను మూసివేశారు.

పవార్ భేటీకి మమత దూరం

కోల్‌కతా: రాష్ట్రపతి ఎన్నికలకు సంబంధించి జూన్ 21న ఎన్‌సీపీ అధినేత శరద్ పవార్ ఏర్పాటు చేస్తున్న విపక్షాల సమావేశానికి పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ హాజరు కావడం లేదని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఒకరు ఆదివారం ప్రకటించారు. ముందుగా ఖరారైన కొన్ని కార్యక్రమాల కారణంగా పవార్ సమావేశానికి ఆమె రావడం లేదని చెప్పారు. ఆ సమావేశానికి మమత తరపున తృణమూల్ సీనియర్ నేత హాజరవుతారని వెల్లడించారు. 'ముందుగా షెడ్యూల్ ఖరారు కావడంతో మమత విపక్షాల సమావేశానికి వెళ్లడం లేదు. ఈ విషయాన్ని శరద్ పవార్‌కు మమత తెలిపారు. అయితే, మా పార్టీ నుంచి ఓ నాయకుడు వెళతారు' అని ఆ సీనియర్ నేత చెప్పారు. రాష్ట్రపతి ఎన్నికల్లో వ్యూహం ఖరారు కోసం జూన్ 15న ఢిల్లీలో మమత మొదటిసారి విపక్షాల సమావేశం ఏర్పాటు చేశారు. 17 ప్రతిపక్ష పార్టీలు సమావేశానికి హాజరయ్యాయి. కాంగ్రెస్, సమాజ్‌వాదీపార్టీ, ఎన్‌సీపీ, డీఎంకే, ఆర్‌జేడీ, వామపక్షాలు హాజరయ్యాయి. ఆప్, శిరోమణి అకాలీదళ్, ఎంఐఎం, టీఆర్ఎస్, బీజేడీ, వైసీపీ గైర్హాజరయ్యాయి. శివసేన, సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్), నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీ, జేడీఎస్, ఆర్ఎస్‌పీ, ఐయూఎంఎల్, ఆర్ఎల్‌డీ, జేఎంఎం కూడా పాల్గొన్నాయి.

వన్యప్రాణుల వేటకు యత్నించిన నలుగురి అరెస్టు

నిందితుల్లో ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులు

రాయ్‌పూర్ : వన్యప్రాణులను వేటాడేందుకు ప్రయత్నించిన నలుగురు వ్యక్తులను ఛత్తీస్‌గఢ్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల్లో ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నట్టు తెలిపారు. పూర్తి వివరాల్లోకి వెళితే రాష్ట్రంలోని బలోదబజార్-భటపరా జిల్లాలోని కస్డోల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పిపార్చెడి అటవీ ప్రాంతంలో వన్యప్రాణులను వేటాడడానికి కొందరు వ్యక్తులు వస్తున్నారనే ముందస్తు సమాచారంతో కాపుకాసిన పోలీసులకు నిందితులు పట్టుబడ్డారు. నిందితులు ప్రయాణిస్తున్న వాహనంలో వన్య ప్రాణులను వేటాడడానికి వినియోగించే టెలిస్కోప్, తుపాకులు, 24 రౌండ్ల బుల్లెట్లు, ఇతర పదునైన ఆయుధాలను గుర్తించినట్టు జిల్లా ఎస్పీ దీపక్ కుమార్ ఝా తెలిపారు. పట్టుబడిన నిందితుల్లో ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులున్నట్టు చెప్పారు. నిందితులను మైనింగ్ విభాగంలో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న షయాద్ నక్వీ, ఫారెస్ట్ గార్డ్ మహ్మద్ వసీం ఖాన్, సివిల్ కాంట్రాక్టర్ ఆనంద్ శ్రీవాస్తవ, నవాజ్ ఖాన్‌లుగా గుర్తించినట్టు తెలిపారు. వీరంతా రాయ్‌పూర్ జిల్లాకు చెందిన వారని, నిందితులపై వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు వివరించారు.

72వేలు దాటిన క్రియాశీల కేసులు

న్యూఢిల్లీ: దేశంలో కరోనా వ్యాప్తి కొనసాగుతోంది. కొన్ని రోజులుగా కొత్త కేసులు 12వేలకుపైగానే నమోదవుతున్నాయి. మరోవైపు క్రియాశీల కేసులు క్రమంగా పెరుగుతూ 72 వేలు దాటడం ఆందోళన కలిగిస్తోంది. కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం.. గడిచిన 24 గంటల్లో 4,46,387 నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా.. కొత్తగా 12,899 కేసులు వెలుగులోకి వచ్చాయి. వీటిలో మహారాష్ట్ర నుంచి 3883 కేసులు.. 2 మరణాలు నమోదయ్యాయి. ఇక శనివారం దేశవ్యాప్తంగా 15 మంది కరోనాతో ప్రాణాలు కోల్పోగా.. ఇప్పటి వరకూ మరణించిన వారి సంఖ్య 5,24,855కు చేరింది. శనివారం 8518 మంది కోలుకోగా.. ఇప్పటి వరకు వైరస్‌ను జయించిన వారి సంఖ్య 4.26 కోట్లు(98.62%) దాటింది. రికవరీలు తక్కువగా ఉంటుండటంతో క్రియాశీల కేసులు అమాంతం పెరుగుతున్నాయి. ప్రస్తుతం దేశంలో 72,474 (0.17%) యాక్టివ్ కేసులు ఉన్నాయి. దేశవ్యాప్తంగా వాక్సినేషన్ నిరంతరాయంగా కొనసాగుతోంది. శనివారం 13,24,591 మంది టీకాలు తీసుకోగా.. ఇప్పటి వరకూ 196.14 కోట్ల డోసులు పంపిణీ చేశారు.

క్రాస్ ఓటింగ్ ప్రసక్తే లేదు: ఉద్ధవ్

ముంబై: సోమవారం జరగనున్న రాష్ట్ర శాసన మండలి ఎన్నికలు తమ పార్టీ నేతృత్వంలోని మహా వికాస్ అఘాడి (ఎంవిఎ)లో ఎలాంటి చీలిక లేదని మహారాష్ట్ర ముఖ్యమంత్రి, శివసేన అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే ఆదివారం అన్నారు. క్రాస్ ఓటింగ్‌కు అవకాశం లేదన్నారు. 'శాసన మండలి ఎన్నికల కోసం మేం మా ఎమ్మెల్యేలందరినీ కలిశాం. నేటి కాలంలో దీనిని ప్రజాస్వామ్యం అంటారు' అని సేన 56వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా సేన శివ ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నాయకులను ఉద్దేశించి ఠాక్రే అన్నారు. భవిష్యత్తులో ఎక్కువ మంది ఎమ్మెల్యేలు ఎన్నికయ్యేలా పార్టీ కష్టపడాల్సి ఉందని, రాష్ట్రంలో ఎన్‌సీపీ, కాంగ్రెస్‌లతో కలిసి అధికారాన్ని పంచుకుంటామని థాకరే అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల గురించి తాను ఆందోళన చెందడం లేదని థాకరే చెప్పారు. 'రాజ్యసభ ఎన్నికల్లో ఓటమి దురదృష్టకరం. ఆర్ఎస్ ఎన్నికల్లో శివసేన ఓట్లు చీలలేదు' అని అన్నారు. శివసేనలో ద్రోహులు లేరని ఆయన స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో శివసేన అభ్యర్థులు సచిన్ అహిర్, ఆంశ్య పద్వీ ఇద్దరూ కొత్త నాయకులుగా ఎదుగుతారని థాకరే విశ్వాసం వ్యక్తం చేశారు. సిట్టింగ్ సేన ఎమ్మెల్సీలు, సీనియర్ నేతలు సుభాష్ దేశాయ్, దివాకర్ రౌటేలతో మాట్లాడామని, వారు పక్కకు తప్పుకోవడానికి వెంటనే అంగీకరించారని సీఎం చెప్పారు. దేశాయ్, రౌటేలను తాను శాసన మండలిలో మరో పర్యాయం కోసం నామినేట్ చేయలేదన్నారు. 'కానీ, వారు పార్టీని స్థాపించినప్పుడు బాలాసాహెబ్ ఠాక్రే అసలు జట్టుకు చెందినవారు కాబట్టి వారు శివసేన ప్రయోజనాలకు పూర్తిగా కట్టుబడి ఉన్నారు. నేను వారిని పదవీ విరమణ చేయనివ్వను. శివసేనను బలోపేతం చేయడానికి నేను వారిని కోరుకుంటున్నాను' అని థాక్రే తెలిపారు.

విదేశీయులను దోచుకుంటున్న ఇరాన్ జాతీయుడి అరెస్టు

న్యూఢిల్లీ: గూఢచర్య సంస్థ ప్రతినిధిగా నటిస్తూ విదేశీయులను దోచుకున్నంటున్న ఇరాన్ జాతీయుడిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడిని ఆగ్నేయ ఢిల్లీలోని లజ్‌పత్ నగర్‌లో నివసిస్తున్న 46 ఏళ్ల హుస్సేన్ రెజాఫర్డ్ అహ్మద్‌గా గుర్తించారు. ఇతడు వైద్య వీసాపై మే 21న భారత్‌కు వచ్చినట్లు వారు తెలిపారు.

గూఢచర్య అధికారిగా చెబుతూ... మాదకద్రవ్యాలు తీసుకువెళుతున్నారన్న నెపంతో భారతదేశానికి వచ్చే విదేశీయుల లగేజీని తనిఖీ చేస్తూ.. విలువైన వస్తువులను, డబ్బును దోచుకునేవాడు. భారత్‌కు వచ్చిన తర్వాత ప్రస్తుతం పరారీలో ఉన్న మరో ఇద్దరితో స్నేహం కుదుర్చుకున్నాడు. వైద్య వీసాపై దేశ రాజధానికి వస్తున్న విదేశీ పౌరులను ఈ ముగ్గురూ లక్ష్యంగా చేసుకున్నారు. నిందితులు ఆసుపత్రులకు వెళ్లే వారి కదలికలను పసిగట్టి ఆపై వారిని అనుసరిస్తూ దోపిడీకి పాల్పడ్డారని పోలీసులు తెలిపారు. జూన్ 16న లజ్‌పత్ నగర్ పోలీస్ స్టేషన్‌లో సూడాన్ జాతీయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అహ్మద్‌ను అరెస్టు చేశామని చెప్పారు. ఇతను వైద్య వీసాలపై గత నెలలో భారత్‌కు వచ్చాడు. తన భార్యతో కలిసి గ్రేటర్ కైలాష్‌లోని ఆసుపత్రి నుంచి ఇంటికి తిరిగి వస్తుండగా అకస్మాత్తుగా ముగ్గురు వ్యక్తులు కారులో వచ్చి తమని ఆపారని, ఆ తర్వాత వారు తమను తాము గూఢచర్య సంస్థకు చెందిన అధికారులమని చెబుతూ.. తన చేతి సంచిని వెతికి, అక్కడి నుంచి పారిపోయారని తెలిపారు. ఆ తర్వాత తన సంచిని పరిశీలించగా, రూ. 50 వేలు సహా 6500 డాలర్లు, కొన్ని సూడానీస్ పౌండ్లు సహా కరెన్సీ కనిపించలేదు. నిందితుడిపై భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 379 (దొంగతనానికి శిక్ష) కింద కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించినట్లు సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. ఇరాన్ జాతీయుడి సహచరుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టినటు పేర్కొన్నారు.

నేడు కర్ణాటకకు ప్రధాని మోదీ

మైసూరులో అంతర్జాతీయ యోగ డే వేడుకలు

న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం నుంచి రెండు రోజుల పాటు కర్ణాటకలో పర్యటించనున్నారు. ఈ మేరకు ఆయన పర్యటనకు సంబంధించిన పూర్తి వివరాలతో పీఎంవో ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. సోమవారం బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సీ)లో సెంటర్ ఫర్ బ్రెయిన్ రీసెర్చ్ (సీబీఆర్) ప్రారంభోత్సవంతో పాటు నగరంలోని నిర్మించ తలపెట్టిన బాగ్చీ-పార్థసారథి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్‌కు శంకుస్థాపన చేయనున్నట్టు తెలిపింది. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ సంస్థను సందర్శించి కొత్త క్యాంపస్‌ను ప్రారంభించి అక్కడ ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్టు తెలిపింది. అనంతరం పారిశ్రామిక అభివృద్ధికి సంబంధించిన 150 టెక్నాలజీ హబ్‌లను జాతికి అంకితం చేయనున్నారని, అనంతరం రూ. 27 వేల కోట్లతో నిర్మించ తలపెట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నట్టు తెలిపింది. బెంగళూరులోని కార్యక్రమాలను ముగించుకుని మైసూరుకు చేరుకుని నగరంలోని మహారాజా కాలేజీ గ్రౌండ్‌లో జరిగే బహిరంగలో పాల్గొననున్నట్టు పేర్కొంది. మంగళవారం ఎనిమిదో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మైసూర్ ప్యాలెస్ మైదానంలో జరిగే సామూహిక యోగా కార్యక్రమంలో మోదీ పాల్గొంటారని తెలిపింది. అంతర్జాతీయ యోగ దినత్సోవాన్ని, 75 ఏళ్ల స్వాతంత్ర్య వేడుకలను ఉద్దేశించిన ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమాన్ని అనుసంధానం చేసి దేశ వ్యాప్తంగా 75 ప్రాంతాల్లో సామూహిక యోగా ప్రదర్శనలు నిర్వహించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంలో భాగంగా ప్రధాని మోదీ మైసూర్‌లో జరుగనున్న యోగా డే వేడుకల్లో భాగస్వామ్యం అవుతున్నారని వివరించింది ఇదిలా ఉండగా ప్రధాని పర్యటన నేపథ్యంలో ఆ కార్యక్రమాల ఏర్పాటును సీఎం బసవరాజ్ బొమ్మై పరిశీలించారు. మీడియాతో మాట్లాడుతూ ఎస్‌పీజీ మార్గదర్శకాలకు అనుగుణంగానే అన్ని ఏర్పాట్లు చేశామని వివరించారు.

యువత జీవితాలతో ఆటలా

అగ్నిపథ్‌పై సీఎం ఉద్ధవ్ థాక్రే ధ్వజం

ముంబై : సైన్యం నియామకాల కోసం కేంద్రం తెచ్చిన అగ్నిపథ్ పథకంపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్ధవ్ థాక్రే మండిపడ్డారు. యువత జీవితాలు, ఆశయాలతో ఆటలాడుకుంటున్నారా అంటూ కేంద్రం తీరుపై ధ్వజమెత్తారు. శివసేన పార్టీ 56వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. దేశ వ్యాప్తంగా యువత నిరుద్యోగ సమస్యతో సతమతమవుతూ ఉంటే అవేమీ పట్టని బీజేపీ నేతలు రాముడి గురించి మాట్లాడుతున్నారంటూ దుయ్యబట్టారు. రాముడి గురించి మాట్లాడితే నిరుద్యోగ సమస్య తీరుతుందా అంటూ ప్రశ్నించారు. కేంద్రం అమలు చేస్తున్న ప్రతి పథకం, చట్టం వివాదాస్పదమవుతూనే ఉన్నాయని పేర్కొన్నారు. గతంలో వ్యవసాయ చట్టాలు తీసుకువచ్చిన తరుణంలో అన్నదాతలే వీధుల్లోకి వచ్చారని గుర్తు చేశారు.

నేడు అగ్నిపథ్ అంటూ తెచ్చిన పథకం యువత జీవితాలతో ఆడుకునేలా తయారు చేశారని దుయ్యబట్టారు. అర్థం లేని పథకాలకు అగ్నిపథ్, అగ్నివీర్ వంటి పేర్లు ఎందుకని నిలదీశారు. ఆ పథకం కింద సైన్యంలో చేరి నాలుగేళ్లు పని చేసిన అనంతరం యువతకు లభించే ప్రయోజనాలేమిటని ప్రశ్నించారు. అగ్నిపథ్‌కు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా ఆందోళనలు జరుగుతూ ఉంటే మహారాష్ట్ర ప్రశాంతంగా ఉందని పేర్కొన్నారు. సైన్యంలో కాంట్రాక్ట్ సైనికులు ఉండటం ప్రమాదకరమని హెచ్చరించారు. అర్థం లేని పథకాలను తెచ్చి, యువత ఆశయాలు, జీవితాలతో ఆడుకోవడం సరికాదని కేంద్రానికి హితవు పలికారు.

పదో తరగతి పరీక్షలు రాసిన తండ్రీకొడుకులు

తండ్రి పాస్.. కుమారుడు ఫెయిల్

ముంబై: యుక్త వయసులో చదువుకునే అవకాశం లేక మలి వయసులో పరీక్షలు రాసి పాసైన వ్యక్తుల గురించి మనం అప్పుడప్పుడూ వింటూనే ఉంటాం. కానీ, మహారాష్ట్రలో ఓ 43 ఏళ్ల వ్యక్తి పదో తరగతి పరీక్ష రాసిన ఉదంతం గురించి మాత్రం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చించుకుంటున్నారు. పుణెకు చెందిన భాస్కర్ వాగ్‌మారే తన కొడుకుతో కలిసి ఇటీవల పదో తరగతి పరీక్ష రాశారు. ఆ ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. వాటిని చూసిన కుటుంబ సభ్యులకు సంతోషించాలో లేక బాధపడాలో అర్థం కాలేదు. ఎందుకంటే భాస్కర్ పరీక్షల్లో పాస్ కాగా.. అతని కొడుకు మాత్రం తప్పాడు. ఏడో తరగతి తర్వాత కుటుంబ బాధ్యతలు మీద పడడంతో భాస్కర్ చదువు మానేశాడు. 30 ఏళ్ల తర్వాత తిరిగి తన కొడుకుతో కలిసి ఈ ఏడాది పది పరీక్షలకు హాజరయ్యాడు. 'పెద్ద చదువులు చదువుకోవాలని నాకు ముందు నుంచీ ఉండేది. కానీ, కుటుంబ బాధ్యతల వల్ల ముందుకు సాగలేకపోయా. కొద్దికాలం నుంచి తిరిగి చదువుకోవాలని అనిపించింది. కొన్ని కోర్సులు చేయడం వల్ల మరింత సంపాదించొచ్చనే ఆలోచన వచ్చింది. అందుకే పదో తరగతి పరీక్షలు రాయాలని నిశ్చయించుకున్నా. నా కొడుకు కూడా ఈ ఏడాదే పరీక్షలు రాశాడు. అది నాకు కాస్త సాయంగా ఉండింది' అని భాస్కర్ తెలిపారు. ప్రస్తుతం ఓ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న ఆయన విధుల నుంచి రాగానే పుస్తకాలు ముందేసుకునేవారు. తాను పాస్ అయినందుకు సంతోషంగానే ఉన్నప్పటికీ.. కొడుకు ఫెయిల్ కావడం మాత్రం బాధిస్తోందని తెలిపారు. తిరిగి సప్లిమెంటరీ ఎగ్జామ్స్ రాసి పాసయ్యేలా కొడుకుకు సహకారం అందిస్తానని పేర్కొన్నారు. ఈసారి తప్పకుండా అతను పాస్ అవుతాడని విశ్వాసం వ్యక్తం చేశారు.

అగ్నిపథ్ ఆర్ఎస్ఎస్ అజెండానా: తేజస్వి

న్యూఢిల్లీ: కొత్త సైనిక నియామకాల విధానం అగ్నిపథ్‌పై యువతకు అనేక సందేహాలు ఉన్నాయని ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ అన్నారు. అందువల్ల దీనిని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అగ్నిపథ్‌ను వ్యతిరేకిస్తూ బీహార్‌లో పెద్ద ఎత్తున నిరసనలు కొనసాగుతోన్న విషయం తెలిసిందే. చదువుకున్న యువతకు అగ్నిపథ్ పథకం 'జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం' వంటిదా? అని తేజస్వీ యాదవ్ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. లేక ఆర్ఎస్ఎస్ అజెండాలో భాగంగా దీన్ని తీసుకొచ్చారా? అని నిలదీశారు. మరోవైపు యువత శాంతియుతంగా నిరసనను వ్యక్తం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ అంశంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎందుకు మౌనం పాటిస్తున్నారని తేజస్వి యాదవ్ ప్రశ్నించారు. 'వన్ ర్యాంక్, వన్ పెన్షన్' గురించి మాట్లాడిన ప్రభుత్వం...ఇప్పుడు 'నో ర్యాంక్, నో పెన్షన్'ను అమల్లోకి తీసుకొస్తోందని మండిపడ్డారు. ఈ పథకంపై యువతకు అనేక సందేహాలున్నాయని చెప్పిన ఆయన...ప్రభుత్వానికి 20 ప్రశ్నలు సంధించారు. అగ్నిపథ్‌ను సైన్యంలోని ఉన్నతాధికారుల నియామకాలకు ఎందుకు వర్తింపజేయడం లేదని ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా అగ్నిపథ్‌పై నిరసనలు కొనసాగుతున్నాయని తేజస్వీ యాదవ్ గుర్తుచేశారు. సైనికులుగా మారాలనుకుంటున్న అనేకమందిలో ఈ కొత్త విధానం ఆగ్రహాన్ని కలగజేస్తోందని చెప్పారు. ఈ నేపథ్యంలో కొత్త విధానాన్ని వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. మరోవైపు బీహార్‌లో చెలరేగుతున్న హింసకు ఆర్జేడీయే కారణమన్న బీజేపీ ఆరోపణలను ఆయన తిప్పికొట్టారు. దీనికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు.అతి ప్రధానమైన నిరుద్యోగ సమస్యను ప్రభుత్వం ఎందుకు పరిష్కరించడం లేదని తేజస్వి ప్రశ్నించారు. నిరుద్యోగం కారణగా చెలరేగిన హింసకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండు చేశారు.

ఇంధనం అమ్మకాలపై నష్టాలను భరించలేం

ప్రభుత్వేతర చమురు విక్రయ సంస్థలు

న్యూఢిల్లీ: దేశంలో ప్రస్తుతానికి ప్రభుత్వ రంగ చమురు సంస్థలు ధరల్ని స్థిరంగా కొనసాగిస్తున్నాయి. అయితే అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరుగుతున్నప్పటికీ దేశీయంగా ఇంధన ధరలు స్థిరంగా కొనసాగించడం తమ వల్ల కాదని జియో-బీపీ, షెల్ పీఎల్‌సీ, నయారా ఎనర్జీ వంటి ప్రైవేటురంగ చిల్లర చమురు సంస్థలు తెగేసి చెబుతుండటంతో మళ్లీ వినియోగదారులపై భారం మోపక తప్పదన్న ఆందోళన నెలకొంది. పెట్రోల్, డీజిల్‌ను తక్కువ ధరకు విక్రయించాల్సి వస్తోందని, పెట్రోలు లీటర్‌కు రూ. 20-25, డీజిల్‌పై రూ.14-18 మేర నష్టపోతున్నామని ఇంధన మంత్రిత్వ శాఖకు తెలిపాయి. వీలైనంత త్వరగా జోక్యం చేసుకొని.. సమస్యకు పరిష్కారం చూపాలని కోరాయి. చమురు విపణిలో 90శాతం ప్రభుత్వ రంగ సంస్థల నియంత్రణలోనే ఉంది. ఆ సంస్థలు పెట్రోల్, డీజిల్‌ను తక్కువ ధరకు విక్రయిస్తుండగా.. ప్రైవేటు సంస్థలపై భారం పడుతోంది. ఫలితంగా విక్రయం తగ్గి, వినియోగదారులను కోల్పోవాల్సి వస్తోంది. 2021 నవంబర్ నుంచి.. 2022 మార్చి 21 వరకు అంటే దాదాపు 137 రోజులు... పెట్రోల్, డీజిల్ ధరలు స్థిరంగా కొనసాగాయి. 5 నెలల తర్వాత 2022 మార్చి 22న తొలిసారి ఇంధన ధరలు పెరిగాయి. అదీ ఉక్రెయిన్- రష్యా యుద్ధం కారణంగా ముడి చమురు ధరలు రికార్డు గరిష్టానికి చేరిన నేపథ్యంలో పెంచాల్సి వచ్చిందని కేంద్రం వివరణ ఇచ్చుకుంది. చమురు సంస్థలు వరుసగా 14 రోజులు... సగటున 80 పైసల చొప్పున ఇంధన ధరలు పెంచుకుంటూ వెళ్లాయి. మళ్లీ ఏప్రిల్ 6 నుంచి స్థిరంగా ఉంచాయి. ఈ నేపథ్యంలోనే రిటైల్ రంగంలో పెట్టుబడులు పెడుతున్న ప్రైవేట్ చమురు మార్కెటింగ్ కంపెనీలు నష్టాలను ఎదుర్కొంటున్నాయని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ పెట్రోలియం ఇండస్ట్రీ(ఎఫ్ఐపీఐ) పేర్కొంది. అందుకే.. ప్రైవేట్ రిటైలర్స్‌కు మద్దతుగా నిలవాలని పెట్రోలియం మంత్రిత్వ శాఖకు ఇటీవల లేఖ రాసింది కూడా. అంతర్జాతీయ ఇంధన ధరలకు అనుగుణంగా రేట్లు పెంచకపోతే భారీగా నష్టాలు వస్తున్నాయని, ఇది డీలర్లు, రవాణాదారులు, ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగులు అందరిపైనా ప్రభావం చూపిస్తుందని స్పష్టం చేసింది. రిటైల్ రంగంలో మరిన్ని పెట్టుబడులను ఆకర్షించడానికి, ఉపాధి కల్పనకు సరైన వాతావరణం కల్పించాలని కోరింది.

కుప్వారాలో ఎన్‌కౌంటర్

నలుగురు ఉగ్రవాదుల హతం

శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్‌లోని కుప్వారా జిల్లాలో ఆదివారం ఉగ్రవాదులకు, భద్రతా బలగాలకు మధ్య చోటు చేసుకున్న ఎన్‌కౌంటర్‌లో నలుగురు ఉగ్రవాదులు హతమైనట్టు పోలీసులు తెలిపారు. ఉగ్రవాదుల కోసం గాలింపు చర్యలు చేపట్టిన దశలో రహస్యస్థావరాల్లో దాగి ఉన్న ముష్కరమూక భద్రతా బలగాలపై కాల్పులకు తెగబడడంతో ఎన్‌కౌంటర్ అనివార్యమైనట్టు తెలిపారు. ఈ ఘటనలో మృతి చెందిన వారిలో ఒకరిని లష్కరే తోయిబా (ఎల్ఈటీ) ఉగ్రవాదిగా గుర్తించామని తెలిపారు. అతను పాక్ పౌరుడని పేర్కొన్నారు. మృతి చెందిన మరో ఉగ్రవాది ఎవరనేది నిర్ధారించలేదని కాశ్మీర్ ఐజీపీ విజయ్ కుమార్ ట్వీట్ చేశారు. ఇదిలా ఉండగా కుల్గామ్ జిల్లాలోని దమ్‌హాల్ హంజిపోరా ప్రాంతంలోనూ ఉగ్రవాదులు, భద్రతా బలగాలకు మధ్య ఎన్‌కౌంటర్ కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

కిడ్నాపర్లపై చర్యలు తీసుకోవాలి

జేఎన్‌యూ టీచర్స్ అసోసియేషన్ డిమాండు

న్యూఢిల్లీ : యూనివర్సిటీలో సహాయ ఆచార్యునిగా పని చేస్తున్న డాక్టర్ శరత్ బావిస్కర్‌ను కిడ్నాప్ చేసి దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం టీచర్స్ అసోసియేషన్ డిమాండు చేసింది. అ నెల 18న సొంతకారులో ప్రయాణిస్తున్న శరత్ ట్రాఫిక్ కారణంగా నెలకొన్న వివాదం నేపథ్యంలో కొందరు దుండగులు ఆయన్ను కిడ్నాప్ చేసి దాడి చేయడంతో ఆర్థిక దోపిడీకి పాల్పడ్డారనిఆదివారం ఒక విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.

ఈ ఘటనపై శరత్ పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందన కరువైందని పేర్కొంది. ఇప్పటికైనా ఢిల్లీ పోలీసులు స్పందించాలని, నేరస్తులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండు చేసింది. శరత్ కుటుంబానికి కూడా తగిన భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేసింది. ఇదిలా ఉండగా కొందరు దుండగులు తనను కిడ్నాప్ చేసి ఆరు గంటల పాటు ఒక నివాసంలో నిర్బంధించినట్టు శరత్ తెలిపారు. అసభ్య పదజాలంతో శారీరకంగా హింసించారని, ఆర్థికంగా దోచుకున్నారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నట్టు తెలిపారు.

యువతను నిరాశ పరిచిన అగ్నిపథ్

భవిష్యత్తు చీకటి అవుతుందనే ఆందోళనలు : మాయావతి

లక్నో : కేంద్రం తీసుకువచ్చిన అగ్నిపథ్ పథకం దేశంలోని యువతను తీవ్రంగా నిరాశ పర్చిందని బహుజన సమాజ్‌వాదీ పార్టీ (బీఎస్‌పీ) అధినేత్రి మాయావతి పేర్కొన్నారు. తక్కువ కాల వ్యవధితో ఉద్యోగాల నియామకం అంటూ రూపొందిన పథకానికి వ్యతిరేకంగా యువత అగ్ని మార్గాన్ని ఎంచుకున్నారంటూ ఆదివారం వరుస ట్వీట్లు చేశారు. అత్యధిక జనాభా ఉన్న భారత్‌లో యువత పేదరికం, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి సమస్యలను ఎదుర్కొంటున్న దశలో అగ్నిపథ్ అంటూ కాలపరిమితి తక్కువగా ఉండే ఉద్యోగాలు అంటే యువత నిరాశతో ఉద్యమబాట పట్టిందని పేర్కొన్నారు. ఈ తరహా నియామకాలతో ఆర్మీ. రైల్వే, పారామిలటరీ ఉద్యోగాల అవకాశాలు తగ్గిపోతాయని, తమ భవిష్యత్తు చీకటిమయం అవుతుందని భావించిన గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువకులు నిస్సహాయ స్థితిలో కోపంతో మండిపోతున్నట్టు పేర్కొన్నారు. ఈ క్రమంలో కేంద్రం తమ నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని కోరారు. అగ్నిపథ్‌కు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్న యువత కూడా సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేశారు.

దిల్లీకి ఆధునిక హంగులు : మోదీ

న్యూదిల్లీ: దేశ రాజధాని ఆధునికతను సంతరించుకుంటోందని, ఆధునిక అభివృద్ధి పనులతో దిల్లీ ముఖచిత్రం మారుతోందని ప్రధాని మోదీ అన్నారు. ఆయన ఆదివారం ప్రగతి మైదాన్ ఇంటిగ్రేటెడ్ ట్రాన్సిట్ కారిడార్ ప్రాజెక్టులో భాగంగా ప్రధాన సొరంగ మార్గంతో పాటు ఐదు అండర్ పాస్‌లను; తూర్పు, పశ్చిమ ఎక్స్‌ప్రెస్ వేలనూ ప్రారంభించారు. కేంద్రప్రభుత్వం నుంచి అందమైన మౌలిక వసతుల కానుకను దిల్లీ అందుకుందని మోదీ అన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల 55 లక్షల లీటర్ల ఇంధనం ఆదా అవుతుందని, కాలుష్యం తగ్గుందని చెప్పారు. పట్టణీకరణ పెంచడాన్ని ఒక అవకాశంగా తమ ప్రభుత్వం భావిస్తుందన్నారు. ప్రజలకు సులభతర జీవనాన్ని అందించేదుకు శ్రమిస్తున్నట్లు తెలిపారు. సమయం చాలా విలువైనది అని మోదీ నొక్కిచెప్పారు. ప్రజల కోసం రూ.100ను ప్రభుత్వం ప్రకటిస్తే అది శీర్షికల్లో కనిపిస్తుందిగానీ రూ.200 ఆదా చేస్తే దాని గురించి ఎవ్వరూ మాట్లాడరన్నారు. సొరంగం, అండర్ పాస్‌ల గోడలపై చిత్రకళలనూ ప్రశంసించారు. ఈ మార్గాలను ఆదివారాలు కొన్ని గంటల పాటు మూసివేసి కళలను ఆశ్వాదిం చేందుకు ప్రజలకు అవకాశమివ్వాలని సూచిం చారు. అలా చేయాలని ఎంపీలతో చెబుతా నన్నారు. ప్రగతి మైదాన్ ఇంటిగ్రేటెడ్ ట్రాన్సిట్ కారిడార్ ప్రాజెక్టు వ్యయం రూ.920 కోట్లకుపైగానే ఉంది. ఇది మొత్తం కేంద్రమే భరిస్తోంది. కాగా, 1.6కిమీల పొడవైన సొరంగ మార్గాన్ని ప్రధాని ఆవిష్కరించారు. ఇది దిల్లో మొదటిది కాగా ఇండియా గేట్ వైపునకు, తూర్పు దిల్లీ, నోయిడా, గాజియాబాద్ నుంచి సెంట్రల్ దిల్లీలోని ప్రాంతాలకు ప్రయాణించే వారికి ఐటీవో, మథురా రోడ్డు, భైరోన్ మార్గ్ ట్రాఫిక్ నుంచి ఉపశమనం లభిస్తుంది. అలాగే సమయంతో పాటు ఇంధనం, డబ్బు ఆదా అవుతాయి.

'నాసికా రంధ్రాల టీకా' ప్రయోగాలు పూర్తి: భారత్ బయోటెక్

న్యూదిల్లీ: కరోనాపై పోరులో భాగంగా అభివృద్ధి చేస్తున్న నాజల్ వాక్సిన్ (నాసికా రంధ్రాల ద్వారా ఇచ్చేది) 3వ దశ ప్రయోగాలు పూర్తయ్యాయని భారత్ బయోటెక్ ప్రకటిం చింది. ఈ విషయాన్ని సంస్థ చైర్మన్, ఎండీ డాక్టర్ కృష్ణా ఎల్లా శనివారం వెల్లడించారు. ఈ వివరాలను డీసీఐజీకి వచ్చే నెల అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది జనవరిలో భారత్ బయోటెక్ సంస్థ నాజల్ వాక్సిన్ 3వ దశ ప్రయోగాలకు నియంత్రణా సంస్థలు అనుమతలు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. ఐరోపాలో నిర్వహిం చనున్న వివ టెక్నాలజీ-2022లో ప్రసంగించేం దుకు వెళ్లిన ఆయన మీడియాతో మాట్లాడారు. నాజల్ వాక్సిన్‌కి సంబంధించిన క్లినికల్ ట్రయల్స్‌ను పూర్తయ్యాయని, ఆ డేటా విశ్లేషణ ప్రక్రియ జరుగుతోందన్నారు. వచ్చేనెల ఆ డేటాను రెగ్యులేటరీ ఏజెన్సీకి అందజేస్తామని, అన్ని సానుకూలంగా ఉంటే వాక్సిన్ విడుదలకు అనుమతులు వస్తాయని చెప్పారు. అప్పుడు ఇది క్లినికల్‌గా నిరూపితమైన తొలి నాజల్ కరోనా వాక్సిన్‌గా నిలుస్తుందన్నారు. కరోనా వాక్సిన్ రెండు డోసులు తీసుకున్న వారందరూ బూస్టర్ డోస్ తీసుకోవాలని స్పష్టం చేశారు.

ముమ్మాటికీ కక్ష సాధింపే: చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: చింతకాయల అయ్యన్నపాత్రుడి ఇంటిగోడ కూల్చివేత ముమ్మాటికీ వైసీపీ ప్రభుత్వ కక్ష సాధింపు చర్యల్లో భాగమేనని టీడీపీ అధినేత చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీలో బలమైన బీసీ నేతలను లక్ష్యంగా చేసుకుని అక్రమ కేసులు, అరెస్టులు, దాడులకు జగన్ పాల్పడుతున్నారన్నారు. చోడవరం మినీమహానాడు వేదికగా వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాడనే అక్కసుతోనే అయ్యన్నపాత్రుడి ఇంటిపై చీకటి దాడులు చేయించాడని విమర్శించారు. అయ్యన్న అడిగిన ప్రశ్నల్లో ఏ ఒక్కదానికైనా సమాధానం ఇవ్వలేని, అందుకే ఏం చేయలేక కూల్చివేతకు పాల్పడ్డారన్నారు.

నేడు చలో నర్సీపట్నం: అచ్చెన్నాయుడు

బీసీలపై వరుస దాడులు, హత్యలను నిరసిస్తూ టీడీపీ అధ్వర్యంలో సోమవారం 'చలో నర్సీపట్నం' నిర్వహించనున్నట్లు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వైసీపీ అరాచకాలను ప్రశ్నించినందుకు టీడీపీ రాష్ట్ర నాయకులు, మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రడు ఇంటి ప్రహరీని జగన్ తన అధికారులను అడ్డుపెట్టకుని, పోలీసు బలగాలతో అర్ధరాత్రి కూలదోశారని విమర్శించారు. గతంలోనూ బీసీ నాయకులు పల్లా శ్రీనివాస్, సబ్బం హరి, ఇలా అనేక మంది బీసీ నాయకులు, కార్యకర్తల ఆస్తులపై జగన్ రెడ్డి దాడులకు పాల్పడ్డారని వివరించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు 26మంది బీసీలను పొట్టనబెట్టుకుందనీ, హత్యకు గురైన వ్యక్తుల కుటుంబ సభ్యులను పరామర్శించడం కూడా వైసీపీకి ఇష్టం లేదన్నారు. బీసీల పట్ల జగన్ చూపిస్తున్న కపట ప్రేమను నిలదీయడానికి నర్సీపట్నానికి బీసీలంతా పెద్దఎత్తున తరలివచ్చి, కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

కక్ష సాధింపులో భాగమే: యనమల

రాష్ట్రంలోని బీసీలను అణచివేయడమే ధ్యేయంగా జగన్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఎమ్మెల్సీ, టీడీపీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు విమర్శించారు. రెండు రోజుల క్రితం జరిగిన మహానాడులో ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించి గళమెత్తినందుకుగాను అయ్యన్నపాత్రుడి ఇంటి గోడలు కూల్చడం సిగ్గుచేటన్నారు. అక్రమ కట్టడమైతే నోటీసులు ఇవ్వకుండా, గోడ కూల్చేసిన తర్వాత ముసుగు వేసుకుని ఒక వ్యక్తిని పంపించి ఇంటి లోపల నోటీసు పత్రాలను విసిరి వెళ్లారన్నారు. అక్రమ కట్టడమైతే, తెల్లవారు జామున నాలుగు గంటలకు ఆర్డీవో, ఎస్పీ సహా వందలాది మందితో రావాల్సిన అవసరం ఏమిటంటూ ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలన్నారు.

సీపీఐ అనకాపల్లి జిల్లా కార్యదర్శిగా బాలేపల్లి

సహాయ కార్యదర్శులుగా దొరబాబు, రామునాయుడు

బాలేపల్లి వెంకటరమణ

రాజాన దొరబాబు

విశాలాంధ్ర-అనకాపల్లి: సీపీఐ అనకాపల్లి జిల్లా కార్యదర్శిగా బాలేపల్లి వెంకటరమణ, సహాయ కార్యదర్శులుగా దొరబాబు, రామునాయుడు ఎన్నికయ్యారు. సీపీఐ అనకాపల్లి జిల్లా ప్రథమ మహాసభ శనివారం అనకాపల్లిలో జరిగింది. సభలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వెంకటరమణ, రాజాన దొరబాబు, మాకిరెడ్డి రామునాయుడుతో పాటు మరో 9 మందిని కార్యవర్గసభ్యులుగా ఎన్నుకున్నారు. 35 మందిని సమితి సభ్యులుగా జిల్లా మహాసభ ఎన్నుకుంది. అనంతరం బాలేపల్లి మాట్లాడుతూ జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలు చేస్తామని, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి, వారి హక్కుల సాధన కోసం గ్రామస్థాయి నుంచి ఉద్యమిస్తామని అన్నారు.

కర్ణాటక కాంగ్రెస్ నేత ఇంటిపై హిందుత్వ సంస్థల దాడి

మంగళూరు: హిందూమతానికి చెందిన దేవుళ్లను కించపరిచే వాఖ్యలు చేశారని ఆరోపిస్తూ హిందుత్వ సంస్థలకు చెందిన కొందరు వ్యక్తులు కాంగ్రెస్ ఐటీ సెల్ కార్యదర్శి వీ శైలజా అమర్‌నాథ్ ఇంటిపై దాడి చేశారని పోలీసులు తెలిపారు. శనివారం ఇంటివద్దకు చేరుకున్న గుర్తు తెలియని దుండగులు ఇంటిపైకి రాళ్లు విసిరి ధ్వంసం చేశారని, కిటికీ అద్దాలు పగుల గొట్టి గోడలపై ఇంకు చల్లినట్టు శైలజ తరపు న్యాయవాది ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. ఘటనపై దర్యాప్తు జరుగుతోందని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా అ నెల 16వ జరిగిన ఒక కార్యక్రమంలో శ్రీరాముడు, సీత, హనుమంతుడిపై శైలజా అమర్‌నాథ్ అవమానకరమైన వ్యాఖ్యలు చేశారని విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ తదితర సంస్థలు పోలీసులకు ఫిర్యాదు చేశాయి. హిందు దేవుళ్లను అవమానించిన శైలజపై చర్యలు తీసుకోవాలంటూ డిమాండు చేశాయి.

ఏడాది అంతానికి దేశమంతటా ఈఎస్ఐ

- నెల్లూరులో 100 పడకల ఆస్పత్రి
- కార్మికమంత్రిత్వ శాఖ వెల్లడి

న్యూదిల్లీ: ఈ ఏడాది చివరి నాటికి దేశమంతటా కార్మికరాజ్య బీమా (ఈఎస్ఐ) పథకం అమలుకానున్నది. ఈ మేరకు కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ అధ్యక్షతన ఆదివారం జరిగిన 188వ సమావేశంలో 2022 చివరి నాటికి దేశవ్యాప్తంగా ఈఎస్ఐ పథకం అమలుకు, వైద్యసేవలందించే విధానాన్ని మెరుగుపరిచేందుకు ఈఎస్ఐసీ కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రస్తుతానికి ఈ పథకం 443 జిల్లాల్లో పూర్తిగా, పాక్షికంగా 153 జిల్లాల్లో అమలవుతోంది. ఈఎస్ఐ పథకం పరిధిలోకి రానివి మొత్తం 148 జిల్లాలు. ఇకమీదట పాక్షికంగా అమలయ్యే జిల్లాలు, పథకం పరిధిలోకి రాని జిల్లాలు పూర్తిగా ఈఎస్ఐ పథకం కిందకు రానున్నాయి. దేశవ్యాప్తంగా 23 కొత్త 100 పడకల ఆసుపత్రులను ఏర్పాటు సమావేశం నిర్ణయించింది. వీటిలో మహారాష్ట్రలోని పాల్ఘర్, సతారా, పెన్, జల్గావ్, చకన్, పన్వెల్‌లో ఆరు ఆసుపత్రులు, హరియాణాలో నాలుగు (హిస్సార్, సోనేపట్, అంబాలా, రోహతక్), తమిళనాడులొ (చెంగల్‌పట్టు, ఈరోడ్), ఉత్తరప్రదేశ్ లో (మొరాదాబాద్, గోరఖ్‌పూర్), కర్ణాటకలో (తుమకూరు, ఉడిపి) రెండేసి చొప్పున ఆసుపత్రులున్నాయి. ఆంధ్రప్రదేశ్ (నెల్లూరు), చత్తీస్‌గఢ్ (బిలాస్‌పూర్), గోవా (ముల్గావ్), గుజరాత్ (సనద్), మధ్యప్రదేశ్ (జబల్‌పూర్), ఒడిశా (ఝార్సుగూడ), పశ్చిమ బెంగాల్ (ఖరగ్‌పూర్)లలో ఒక్కో ఆసుపత్రిని ఈఎస్ఐసీ ఏర్పాటు చేస్తుంది. వీటితో పాటు కొత్తగా మహారాష్ట్రలో 48, దిల్లీలో 12, హరియాణాలో 2 చొప్పున 62 వైద్యశాలల్ని తెరవనున్నారు. వీటిలో బీమా చేసిన కార్మికులు, వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తారు. ఈ ఏడాది చివరి నాటికి దేశవ్యాప్తంగా ఆరోగ్య బీమా పథకాన్ని అమలు చేయాలని ఈఎస్ఐసీ నిర్ణయించింది. ఎంఐఎంపీ (మోడిఫైడ్ ఇన్సూరెన్స్ మెడికల్ ప్రాక్టీషనర్), ఆయుష్మాన్ భారత్ ప్రధాన్ మంత్రి జన్ ఆరోగ్య యోజన (పీఎంజేఏవై) అనుసంధాన ఆసుపత్రులను జాబితాలో చేర్చి కొత్త డీసీబీఓ (డిస్పెన్సరీ కమ్ బ్రాంచ్ కార్యాలయాలు)లు ఏర్పాటు చేయడం ద్వారా వైద్య సేవలు అందించబడతాయి.

రెవెన్యూ సమస్యలపై దృష్టి పెట్టాలి : బొప్పరాజు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రెవెన్యూ కార్యాలయాల సిబ్బంది సమస్యల పరిష్కారంపై తక్షణమే ప్రభుత్వం చొరవ చూపాలని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు కోరారు. విజయవాడ రెవెన్యూ భవనంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. బొప్పరాజు మాట్లాడుతూ, తహసీల్దారు కార్యాలయాలకు సరిపడా సిబ్బంది లేరనీ, నిధులు లేవనీ, కనీస సౌకర్యాలు అంతకంటే లేవన్నారు. నూతన జిల్లాలు, డివిజన్ కార్యాలయాల్లో పరిస్థితి మరీ అధ్వానంగా ఉందన్నారు. ప్రతి వారం సమీక్షలపై సీఎం జగన్ చూపుతున్న శ్రద్ధను సైతం ఉద్యోగులకు అవసరమైన నిధులు, కనీస సౌకర్యాల పట్ల చూపడం లేదన్నారు. ఉద్యోగులు దాచుకున్న డబ్బును ఈ ఏడాది ఏప్రిల్ 30 నాటికి చెల్లించాలంటూ స్వయానా సీఎం ఆదేశించినా, ఆర్థికశాఖ ఉత్తర్వులు జారీచేయకపోవడం దారుణమని, దీంతో దిక్కుతోచని స్థితిలో రెవెన్యూ ఉద్యోగులున్నారన్నారు. కరోనాకు ముందు, కరోనా సమయంలో మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు అందని కారుణ్య నియామకాలు జరగలేదని, వారి కుటుంబ సభ్యులు దయనీయ పరిస్థితిలో ఉన్నారన్నారు. ఉన్న కార్యాలయాల్లో మౌలిక వసతులు లేమి, నిధుల కొరతతో పెను సవాళ్లుగా మారాయాని తెలిపారు. వాటిని అధిగమించడంలో తీవ్రమైన మానసిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారని చెప్పారు. జిల్లాల పునర్విభజనలో భాగంగా నూతనంగా ఏర్పడిన జిల్లాలకు అరకొర సిబ్బందిని కేటాయించి సరిపడా నిధులు, కనీస సౌకర్యాలు కల్పించకుండా ప్రతి వారం పురోగతిని ఆశించడం సరికాదన్నారు. రాష్ట్రంలో కరోనాకు ముందు, కరోన కాలములో మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు కల్పించాల్సిన కారుణ్య నియామకాలూ ఇంతవరకూ అమలుకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పనిభారం, మానసిక, ఆర్థిక ఒత్తిడితో సతమతమవుతున్న రెవెన్యూ ఉద్యోగులు తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కోరారు. జిల్లాల పునర్విభజన భాగముగా నూతనంగా ఏర్పడిన జిల్లాలకు అరకొర సిబ్బందిని కేటాయించి సరిపడా నిధులు, కనీస సౌకర్యాలు కల్పించకుండా ప్రతి వారం పురోగతిని ఆశించడం సరికాదన్నారు. వెంటనే కొత్తగా ఏర్పడిన జిల్లాల్లోని కలెక్టర్, రెవెన్యూ డివిజన్ కార్యాలయాల్లో పాత సిబ్బందిని కొనసాగించాలని, నూతన జిల్లాలలో మౌలిక సదుపాయాల కల్పనకు అదనంగా ప్రతీ జిల్లాకు ఒక కోటి రూపాయల బడ్జెట్ తక్షణమే మంజూరు చేయాలని డిమాండు చేశారు. సిబ్బందికి సాంకేతిక, సాధారణ సమస్యలపై శిక్షణ, కనీస సౌకర్యాలు, నిధుల మంజూరుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేబ్రోలు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పునరుజ్జీవం దిశగా కాంగ్రెస్

- నెల తర్వాత చింతన్ శిబిర్ నిర్ణయాల ఆచరణ
- కమ్యూనికేషన్స్ బాధ్యతలు జైరాం రమేశ్‌కు అప్పగింత
- బీజేపీపై రైతులు-యువత ఆగ్రహం కలిసివచ్చేనా?

న్యూదిల్లీ: కొద్దికాలంగా ఎన్నికల్లో వరుస పరాభవాలతో నీరసించిన కాంగ్రెస్ ఇటీవల చింతన్ శిబిరాన్ని నిర్వహించి పార్టీ వర్గాల్లో ఉత్సాహం నింపే ప్రయత్నాన్ని చేసింది. పార్టీకి పునర్జీవం పోసేందుకు, పూర్వవైభవం తెచ్చేందుకు నాయకులు, కార్యకర్తలను ప్రోత్సహించింది. పునరుద్ధరణకుగాను ప్రణాళికలను, కార్యాచరణలను రూపొందించుకుంది. అయితే చింతన్ శిబిర్ జరిగిన నెల తర్వాత ఆ దిశగా మొదటి అడుగు పడింది. ప్రచారం, సామాజిక-డిజిటల్ మాధ్యమాల బాధ్యతలను సీనియర్ నేత జైరాం రమేశ్‌కు అప్పగించింది. మీడియాచీఫ్‌గా ఫైర్‌బ్రాండ్ పవన్ ఖేరాను నియమించింది. దీంతో ప్రజల్లోకి వెళ్లేందుకు కొత్త దారులను ఏర్పాటు చేసుకుంటోంది. ఉదయ్‌పూర్ సమావేశంలో ప్రజల్లోకి వెళ్లాలని మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ నొక్కిచెప్పిన క్రమంలో కాంగ్రెస్ ఇందుకు తొలి ప్రాధాన్యత ఇచ్చింది. కమ్యూనికేషన్ వ్యూహంపై దృష్టి పెట్టింది. మూడు రోజుల పాటు జరిగిన సమావేశంలో జరిగిన మేథోమధనం క్రమంలో పార్టీ క్షేత్రస్థాయి వరకు అధిష్ఠానం సందేశం వెళ్లింది. కింది స్థాయి నుంచి రాష్ట్ర శాఖల వరకు చైతన్యం వచ్చింది. కొత్తగా ప్రతిజ్ఞలు బూనుతూ పార్టీ పునరుద్ధరణకు పటిష్ట చర్యలకు అంతా నడుం బిగించినట్లు కాంగ్రెస్ సీనియర్ నేత అజయ్ మాకేన్ అన్నారు. 50ఏళ్ల లోపు కార్యకర్తలకు రాష్ట్రం, జిల్లా, మండల స్థాయిలో 50శాతం రిజర్వేషన్ కల్పన; కొత్త మండల కమిటీల ఏర్పాటు వంటి నిర్ణయాలు ఇందులో భాగమన్నారు. పునరద్ధరణ దిశగా నూతన పథంలో పార్టీ పయనం ఇప్పటికే ప్రారంభమైందని రాబోయే నెలల్లో మార్పులు కనిపిస్తాయని తెలిపారు. 2024 లోక్‌సభ ఎన్నికల కోసం టాస్క్‌ఫోర్స్ ఏర్పాటును ప్రస్తావించారు. ఒక వ్యక్తికి ఒకటే స్థానం ఫార్ములా అములుకు అంగీకారం కుదిరిన నేపథ్యంలో ఐదేళ్లకుపైగా పదవిలో ఉన్న వారి స్థానాన్ని వేరొకరు భర్తీ చేస్తారని మాకెన్ అన్నారు. ఇదే క్రమంలో రణదీప్ సూర్జేవాలా స్థానంలోకి జైరాం రమేశ్ వచ్చారని ఆయనన్నారు. ఈ పదవిలో సూర్జేవాలా ఏడేళ్లు ఉన్నారు. 2020లో కర్ణాటకలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన తర్వాత కూడా మీడియా చీఫ్‌గా కొనసాగారు. కమ్యూనికేషన్స్ విభాగాన్ని విస్తరించే అంశమై మాట్లాడుతూ, రాష్ట్ర శాఖలన్నీ దీని పరిధిలోకి వచ్చేశాయని, ఫలితంగా మెరుగైన సహకారం.. ఏకరూప్య సందేశాలు ఉంటాయని పార్టీ అంతర్గత వర్గాలు పేర్కొన్నాయి. ఊహించని విధంగా గాంధీ కుటుంబ సభ్యులకు ఈడీ సమన్లు జారీ కావడం అదే సమయంలో అగ్నిపథ్ పథకానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళనలు జరగడం కాంగ్రెస్‌కు కలిసివచ్చే అంశంగా పరిణమిస్తోంది. ఆ పార్టీ ప్రజల్లోకి వెళ్లేందుకు అవకాశం దొరికినట్లు అయింది. యువతలో ఆగ్రహం అధికార బీజేపీ ఎదుట పెద్ద సవాల్‌గా నిలిచిందన్న అభిప్రాయం నేతల్లో ఉంది. ఇదే క్రమంలో కాంగ్రెస్ సత్యాగ్రహం కార్యక్రమాన్ని చేపట్టింది. ఆదివారం దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద పార్టీ ప్రధాన నేతలు సత్యాగ్రహం చేశారు. యువత సమస్యలపై గళమెత్తారు. సాయుధ దళాల్లో నియామకాల విషయమై భవిష్యత్‌పై అనిశ్చితి నెలకొనేలా ప్రభుత్వం చేసిందని దుయ్యబట్టారు. ఈ అంశాలు హిమాచల్ ప్రదేశ్, గుజరాత్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు సానుకూలంగా పరిణమిస్తాయన్న అంచనా పార్టీ వర్గాల్లో ఉంది. ఈ రాష్ట్రాల్లో గెలుపు కాంగ్రెస్ పార్టీకి చావో-రేవో అన్న పరిస్థితిగా మారింది. రాజస్థాన్,చత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోనే సొంతంగా అధికారంలోకి రాగలిగింది. అలాగే ప్రతిపక్షం క్యాంపులో కీలక స్థానాన్ని పొందడం కూడా పార్టీకి ముఖ్యం. చక్రం తిప్పాలని భావించే టీఎంసీ అధినత్రి మమతా బెనర్జీ కాంగ్రెస్ కంటే ముందుగానే రాష్ట్రపతి అభ్యర్థిపై చర్చకు ప్రతిపక్షాలను ఆహ్వానించారు. ఈ వ్యవహారంలో ప్రతిపక్షాలతో సంప్రదింపులు జరపమని మల్లికార్జున ఖర్గేను ఆదేశించిన కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ వెనక్కుతగ్గి మమతా బెనర్జీ సమావేశానికి ఖర్గేను పంపాల్సి వచ్చింది. ఇదే వ్యవహారంలో తదుపరి సమావేశాన్ని ఎన్‌సీపీ చీఫ్ శరద్ పవార్ నిర్వహించనుండగా కాంగ్రెస్ చల్లబడిపోయింది. కీలక నేతలు కపిల్ సిబల్, సునీల్ ఝాకర్, హార్దిక్ పటేల్ వంటి వారు పార్టీని వీడారు. ఇన్ని సవాళ్ల సుడిగండం నుంచి కాంగ్రెస్ ఎలా బయటకు వస్తుంది.. వీటన్నింటిని అధిగమించి ఏ విధంగా నిలద్రొక్కుకోగలుగుతుందన్నది వేచిచూడాలి.

సాగు చట్టాల పరిస్థితి తేవద్దు

న్యూదిల్లీ: వివాదాస్పద సాగు చట్టాలపై పోరు తరహా పరిస్థితి పునరావృతం కానివ్వద్దని, యువతను బాధించిన అగ్నిపథ్ పథకాన్ని వెంటనే ఉప సంహరించాలని కాంగ్రెస్ నేత సచిన్ పైలట్ ఆదివారం కేంద్రాన్ని కోరారు. మొండి వైఖరిని విడనాడాలని హితవు పలికారు. కొన్నేళ్లుగా ఏదో ఒక అంశమై దేశం అట్టుడుకుతూనే ఉందని అన్నారు. అగ్నిపథ్ పథకానికి తిరస్కృతి, నిరుద్యోగం, ఆర్థిక, వ్యవసాయ సంక్షోభం వంటివి యువతలో ఆగ్రహానికి కారణమ య్యాయన్నారు. ఆయన పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రతిపక్షంపై నిందలు వేయడాన్ని ప్రభుత్వం మానుకోవాలని కేంద్రాన్ని సూచించారు. నిందా క్రీడను విడనాడాలని, సాగు చట్టాల వ్యతిరేక ఆందోళనప్పుడు ప్రభుత్వం ఇలానే వ్యవహరించిందని అన్నారు. 'సాగు చట్టాల రద్దునకు ఏడాది సమయం పట్టింది. రాజకీయంగా తీవ్రస్థాయిలో ఒత్తిడి తేవాల్సి వచ్చింది. ఇది దానికంటే తీవ్రమైన అంశం. యువత భవిష్యత్‌కు సంబంధించినది. ఈ పథకాన్ని తక్షణమే రద్దు చేయాలి. ఈ ప్రభుత్వం ఎవరి మాట వినిపించుకోదు. దేశానికి సంరక్షునిగా ఉండాలేగానీ మొండిగా కాదు' అని పైలట్ అన్నారు.

హింస ఏ మతం పేరుతో జరిగినా పాపమే: సాయిపల్లవి

హైదరాబాద్: హింస ఏ మతం పేరుతో జరిగినా పాపమేనని నటి సాయిపల్లవి అన్నారు. గో సంరక్షకులను, కశ్మీర్ పండిట్లను ఊచకోత కోసిన ఉగ్రవాదులను ఒకే గాటిన కట్టారంటూ వస్తున్న విమర్శలపై సినీనటి సాయిపల్లవి స్పందించారు. శనివారం ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె ఓ వీడియో సందేశాన్ని ఉంచారు. కొన్నిరోజులుగా నా వ్యాఖ్యలను వక్రీకరిస్తూ జరుగుతున్న ప్రచారానికి సంబంధించి స్పష్టత ఇచ్చేందుకే మీ ముందుకు వచ్చాను. ఇప్పుడు కూడా నా అభిప్రాయాన్ని చెప్పాలంటే ఒకటికి రెండుసార్లు ఆలోచించాల్సి వస్తోంది. మళ్లీ నా మాటలు వక్రీకరించవచ్చు. ఇంటర్వ్యూలో నన్ను మీరు లెఫ్ట్ వింగ్‌కి మద్దతిస్తారా? రైట్ వింగ్‌కి మద్దతిస్తారా? అని అడిగారు. నేను దేనికి మద్దతు ఇవ్వడం లేదు అని స్పష్టంగా చెప్పాను. ఆ ఇంటర్వ్యూను ముక్కలు ముక్కలుగా చేసి వైరల్ చేశారు. 'కశ్మీర్ ఫైల్స్' సినిమా చూశాక చాలా బాధపడ్డాను. అదే విషయాన్ని చిత్ర దర్శకుడు వివేక్ అగ్నిహోత్రితో పంచుకున్నాను. అక్కడి ప్రజలు వలస వెళ్లడం చూసి చాలా డిస్టర్బ్ అయ్యాను అని ఆయనతో చెప్పాను. అలాగే కొవిడ్ టైమ్‌లో ఒక గుంపు గో రక్షణ పేరుతో ఓ వ్యక్తిపైన దాడి చేసిన ఘటన నన్ను కదిలించింది.

నా దృష్టిలో హింస ఏ రూపంలో ఉన్నా తప్పే. ఏ మతం పేరుతో జరిగినా అది పాపమే. ఒక వైద్యురాలిగా ప్రాణం విలువ నాకు తెలుసు. ఒకరి ప్రాణం తీసే హక్కు మరొకరికిలేదు. ప్రతి ఒక్కరి ప్రాణం విలువైనదే' అని అందులో పేర్కొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.